

టీడీపీ హయాంలో 2014-19 సంవత్సరాల్లో ఎన్టీఆర్ హౌసింగ్ ద్వారా ఇళ్లు మంజూరైన పేదలకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ ఇచ్చింది. ఆ సమయంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు పెండింగు బిల్లులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కసరత్తు ప్రారంభించింది. దీంతో జిల్లాలో 21,439 లబ్ధిదారులకు సుమారు 29.78 కోట్ల రూపాయల బిల్లులు రానున్నాయి.

'ఎన్టీఆర్' ఇళ్లకు గుడ్‌న్యూస్

- 2014-19 మధ్య గృహాల పెండింగు బిల్లుల చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్
- జిల్లాలో 21,439 మంది లబ్ధిదారులకు రూ.29.78 కోట్ల బిల్లులు

(కడప-ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు గృహ నిర్మాణశాఖ అధికారులు అప్పట్లో మంజూరైన ఇళ్లనిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో సర్వే చేస్తూ వాటిని ఫొటోలు తీసి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. అప్పట్లో ఎన్టీఆర్ గ్రామీణ, ఎన్టీఆర్ అర్బన్, ఎన్టీఆర్ రూరల్ పేరిట పేదలకు పక్కాగృహాలు మంజూరు చేసింది. యూనిట్ కాస్ట్ రూ.2.50 లక్షలుగా ఉండేది. జిల్లాలో పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణం సాగింది. అయితే 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు చెల్లించాల్సి ఉంది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ బిల్లులు ఇవ్వకుండా నిలిపివేసింది. జగనన్న ఇళ్లు అంటూ శ్రీకారం చుట్టారు. అయితే టీడీపీ హయాంలో ఇంటి నిర్మాణం రూ.2.50 లక్షలు ఉంటే జగన్ దానిని రూ.1.80లక్షలకు కుదించారు.

ఎన్టీఆర్ ఇళ్ల నిర్మాణాలను పట్టించుకోకుండా వదిలేశారు. ఈ బిల్లుల కోసం ఐదేళ్లుగా లబ్ధిదారులు వేచి చూశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో అప్పటి అసంపూర్తి నిర్మాణాలు పరిశీలించేందుకు గృహనిర్మాణశాఖ వర్క్ ఇన్‌స్పెక్టర్లు జిల్లాలోని 36 మండలాల్లో ఊరూరా వెళ్లి సర్వేచేస్తున్నారు. ఇంటి నిర్మాణం ఏ దశలో ఉంది, ఎంత వరకు బిల్లులు చెల్లించారు.. ఇలా మొత్తం అన్నీ సేకరిస్తున్నారు. బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాలతో పాటు ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో సర్వే పరిశీలిస్తున్నారు. మొత్తం జిల్లాలో అప్పటి ఎన్టీఆర్ గృహ నిర్మాణాలు కింద చేపట్టిన వాటిలో 21,439 ఇళ్లు వివిధ దశల్లో నిలిచి పోయినట్లు గుర్తించారు. బిల్లులు రావాల్సి ఉంది. మొత్తం రూ.29.78 కోట్ల మేర పెండింగు బిల్లులు ఇవ్వాల్సి ఉంది. వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఊరారా వెళ్లి ఇళ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయనేది ఫొటోలు తీసి జియోట్యాగ్ చేసి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. శుక్రవారం నాటికి దాదాపు 20,500 ఇళ్లకు జియోట్యాగ్ పూర్తి చేశారు.

నిర్మాణాలు వివిధ దశల్లో

ఎన్టీఆర్ గృహ నిర్మాణాల్లో 4,400 ఇళ్లు పూర్తయ్యాయి. అయితే బిల్లులు రావాల్సి ఉంది. శ్లాబులెవల్‌లో 9,700, గోడ లెవల్‌లో 900, బీఎల్‌లో 2,000, బీబీఎల్‌లో 2,000 ఇళ్లు ఉన్నట్లు గుర్తించారు. ఇంటింటికీ వెళ్లి ఆ ఇళ్లనిర్మాణం పరిస్థితి, ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకుని నమోదు చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా పెండింగు బిల్లుల ఇళ్లు..

నియోజకవర్గం	పెండింగు ఇళ్లు
బద్వేలు	3,319
మైదుకూరు	2,851
ప్రొద్దుటూరు	1,424
జమ్మలమడుగు	6,210
పులివెందుల	3,672
కమలాపురం	3,041
సిద్దవటం, ఒంటిమిట్ట	922
మొత్తం	21,439



బ్రహ్మంగారిమఠంలో ఎన్టీఆర్‌గృహాన్ని నమోదు చేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్

సామాన్యుడి నుంచి సౌత్ కొరియా వరకు..

- దక్షిణ కొరియాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన మొట్టమొదటి విదేశీ సైంటిస్ట్ రాజేశ్‌కుమార్
- యువ సైంటిస్టులకు ఆదర్శంగా నిలిచిన వైనం
- ప్రపంచ దేశాల్లో పేరు ప్రఖ్యాతులు

సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని.. ఎస్వీ యూనివర్శిటీలో పీజీ, పీహెచ్‌డీ పూర్తిచేసి భారతదేశం గర్వపడే స్థాయిలో దక్షిణ కొరియాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన మొట్టమొదటి విదేశీయుడు రాజేశ్‌కుమార్. బద్వేలుకు చెందిన ఈయన బాల్యమంతా కష్టాలమయమే. తండ్రి బాడుగ జీపు నడుపుతూ చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు. అప్పట్లోనే చదువు విలువ తెలిసిన రాజేశ్‌కుమార్ ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాన్ని పొంది, కుటుంబానికి అండగా నిలబడాలనుకున్నారు. ఆ మేరకు ఆర్థిక స్థోమత లేకున్నా.. రాజేశ్‌కుమార్ పట్టు విడవలేదు. డిగ్రీ వరకు బద్వేలు, అనంతరం తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో పీహెచ్‌డీ పూర్తిచేసి సైంటిస్ట్ స్థాయికి చేరుకున్నారు. దేశ విదేశాల్లో ప్రఖ్యాత జనరల్స్‌లో ఈయన పరిశోధనా పత్రాలు ప్రచురితం అయ్యాయి. దాదాపు 70 పరిశోధనలకు పేటెంట్ పొందారు. త్వరలో ఇండియాకు తిరిగొచ్చి ఫ్లోరైడ్ నీటిపై పరిశోధనలు చేసి దేశం రుణం తీర్చుకుంటానని అంటున్న రాజేశ్‌కుమార్‌పై ప్రత్యేక కథనం..

వివరాలు 6లో...



ల్యాబ్‌లో పరిశోధనలు జరుపుతున్న రాజేశ్‌కుమార్

Sunday Special

కడప గడపలో కలకలం

కడప గడపలో శనివారం కలకలం రేగింది. టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై కొన్ని మూకలు హత్యాయత్నానికి పాల్పడడం సంచలనం రేపింది. బయటకి వచ్చిన శివకొండారెడ్డి ఇంటికి వెళుతుండగా మాటు వేసిన ఓ మూక బ్యాచ్ ఆయనను అంతమొందించేందుకు వెంటాడి కర్రలతో దాడి చేశారు. చుట్టూ ఉన్న జనాలు కేకలు వేయడంతో దుండగులు కేవలం దాడితో ముగించుకుని పలాయనం చిత్తగించారు. ఈ ఘటన కడప గడపలో సంచలనం రేపింది. దీనిపై ఇటు టీడీపీ, వైసీపీ ఇతర పార్టీల్లో చర్చ జరుగుతుండగా బద్వేలులో ఓ బాలికను సజీవంగా కాల్చి అంతమొందించేందుకు ప్రయత్నం చేయడం తీవ్ర కలకలం రేపింది. ఆ బాలిక 85 శాతం గాయాలతో చావుబతుకుల మధ్య పోరాటం చేస్తోంది. ఈ రెండు ఘటనలు ఒకేరోజు గంట వ్యవధిలో జరగడం తీవ్ర కలకలం రేపింది.



శివకొండారెడ్డిపై దాడి చేస్తున్న దృశ్యం

దాడికి దుండగులు తెచ్చిన కర్రలు.. దాడిలో గాయపడ్డ శివకొండారెడ్డి

- బాలికను అడవిలోకి తీసుకెళ్లి నిప్పంటించిన మానవమృగం
- మంటల్లో పూర్తిగా దెబ్బతిన్న అవయవాలు
- బాలిక పరిస్థితి విషమం
- ఘటనపై సీఎం చంద్రబాబు సీరియస్
- టీడీపీ కడప నగర అధ్యక్షునిపై హత్యాయత్నం
- కర్రలతో దాడిచేసిన గుర్తు తెలియని వ్యక్తులు
- పలువురు టీడీపీ నేతల పరామర్శ
- సొంత పార్టీ పాలనలో నగర అధ్యక్షునిపై దాడి జరగడంతో..
- టీడీపీ శ్రేణుల్లో కలవరం
- ఒకేరోజు రెండు సంఘటనలు పోలీసులకు సవాల్

(కడప-ఆంధ్రజ్యోతి): టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడి ఘటన చిన్నచౌకు పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగింది. అది కూడా పొద్దు పొద్దున్నే. ఇక బద్వేలులో బాలిక ఘటన సంచలనం రేపింది.

కడప గడపలో..

టీడీపీ కడప నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో కూతవేటు దూరంలోనే హత్యాయత్నం జరగడం కలకలం రేపింది. సానపురెడ్డి శివకొండారెడ్డి కుటుంబం 1989 నుంచి టీడీపీలోనే కొనసాగుతోంది. వీరి కుటుంబం టీడీపీకి వీరాభిమానులు. 2019లో కడప నగర అధ్యక్షుడుగా నియమించారు. అప్పటి నుంచి పార్టీ పిలుపు మేరకు కడపలో ఇతరత్రా వైసీపీ పై పోరాటం చేస్తూ వస్తున్నారు. చిన్నచౌకులోని రెడ్డికాలనీలో నివాసం ఉంటున్న శివకొండారెడ్డి రోజు వారి దినచర్యలో భాగంగా ఉదయం 6.30కు బయటికి వచ్చి చిన్నచౌకులోని జనసేన పార్టీ కార్యాలయం ఎదురుగా ఉన్న కాఫీషాపులో టీ తాగి అక్కడ నుంచి కూరగాయలు తీసుకుని ఇంటికి వెళుతుండగా.. మార్గమధ్యంలో మానస కళ్యాణమండపం ప్రస్తుతం రిలయన్స్ స్మార్ట్ వద్ద ఆయన వెహికల్ స్లో చేయగా వెనక నుంచి దుండగులు కర్రలతో దాడి చేశారు. ఊహించని పరిణామంతో అవాక్కయిన శివకొండారెడ్డి ఎవర్రా మీరంతా అనగానే తలపై దాడి చేశారు. చుట్టుపక్కల వారు కేకలు వేయడంతో వచ్చిన బ్యాచ్ పారిపోయారు. ఈ ఘటనలో శివకొండారెడ్డి వీపుపై, తలపై గాయాలయ్యాయి.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డితో మాట్లాడుతున్న పోలీసు

టీడీపీ శ్రేణుల్లో కలవరం

కడప టీడీపీలో ప్రస్తుతం ఓ ప్రత్యేక వాతావరణం నెలకొంది. శివకొండారెడ్డిపై దాడితో టీడీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో పోలీసులు, వైసీపీ నేతల భూకబ్జాలు దందాలపై దండయాత్ర చేసినా ప్రెస్‌మీట్లు చేసినా కూడా టీడీపీ కార్యకర్తలపై కనీసం ఈగ కూడా వాలలేదు. వైసీపీ నేతలు కూడా పొలిటికల్‌లో ఇలాంటి కక్ష తీర్చుకోలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే అది కూడా నగర అధ్యక్షుడిపై హత్యాయత్నం చేయడం టీడీపీ శ్రేణులను కలవరపాటుకు గురి చేస్తోంది. పార్టీ కోసం మనమెంతో కష్టపడ్డాం. అలాంటి మన ప్రభుత్వంలోనే మనోళ్లను చంపే స్థాయికి వచ్చారా అంటూ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సొంత పార్టీ నేతలపైనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కఠినంగా శిక్షించాలి : అమీర్‌బాబు

కడప నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై దాడి చేసిన దుండగలను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు వినతిపత్రం అందించారు. కడపలో ఎన్నడు లేని సంస్కృతికి ఇప్పుడు కొందరు తెర లేపుతున్నారన్నారు. శివకొండారెడ్డిపై దాడి చేసిన విషయాన్ని సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

పలువురు పరామర్శ

సానపురెడ్డి శివకొండారెడ్డిపై దాడి చేయడాన్ని టీడీపీ, వైసీపీ నేతలు తీవ్రంగా తప్పుబట్టారు. దాడి జరిగిన వెంటనే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఇన్‌చార్జి వీఎస్ అమీర్‌బాబు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న శివకొండారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఎస్పీని కలిసి నిందితున్ని అరెస్టు చేయాలని కోరారు. శివకొండారెడ్డిని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి పరామర్శించారు. ఆయనపై దాడిలో వైసీపీ ప్రమేయం లేదన్నారు. ప్రజాస్వామ్యంలో దాడులు సిగ్గుచేటన్నారు. టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇక టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, అలంఖాన్‌పల్లె టీడీపీ నేత లక్ష్మిరెడ్డి పరామర్శించారు. ఫోనులో మంత్రి నారాలోకేశ్ పీఏ, ఎమ్మెల్సీ రామచంద్రయ్య, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. జిల్లాలో ఒకే రోజు జరిగిన ఈ రెండు ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి.

అడవిలోకి తీసుకెళ్లి..


బద్వేలులో 16 సంవత్సరాల బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అయితే ఆ ప్రాంతానికి చెందిన విఘ్నేశ్ అనే వ్యక్తితో చిన్నప్పటి నుంచి స్నేహం ఉంది. ఇతనికి పెళ్లి అయింది. భార్య గర్భవతి. విఘ్నేశ్ కడపలో ఓ హోటల్‌లో వంటమాస్టరుగా పనిచేస్తున్నాడు. ఇతను బాధిత బాలికపై కన్నేశాడు. ఈ రోజు నన్ను కలవాలి, లేకపోతే నేను చచ్చిపోతా అంటూ ఆ అమ్మాయికి శుక్రవారం ఫోను చేసి బెదిరించాడు. పరిచయం ఉన్న వ్యక్తి సూసైడ్ అనడంతో భయపడిన ఆ అమ్మాయి శనివారం కళాశాలకు పోకుండా ఆటోలో బయల్దేరగా మధ్యలో విఘ్నేశ్ ఎక్కాడు. బద్వేలు మున్సిపాలిటీ పరిధిలో గోపవరం శివారులోని పీపీకుంట వద్ద ఉన్న సెంచురీ ప్లైవుడ్ సమీపంలో జిల్లా సరిహద్దుల్లో ముళ్లపొదల్లోకి తీసుకెళ్లాడు. అయితే అక్కడ వీరిద్దరి మధ్య ఏం జరిగిందో తెలియదు కానీ ఆ బాలికకు నిప్పంటించి పరారయ్యాడు. కాలిన గాయాలతో ఆర్తనాదాలు చేసిన బాలికను కనుక్కొని స్థానికులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తీసుకువచ్చారు. అయితే బాలిక పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

సీఎం చంద్రబాబు సీరియస్

గోపవరం మండలంలో ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీరియస్ అయ్యారు. జిల్లా అధికారులతో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలంటూ జిల్లా అధికారులను ఆదేశించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. దీంతో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఘటనాస్థలికి వెళ్లారు. అయితే ఇప్పటికే నిందితున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు చెబుతున్నారు.

వైవీయూలో గోల్‌మాల్

జగన్ పాలనలో జిల్లాలోని విద్య, వైద్య సంస్థలను సొంత పరిశ్రమలుగా మార్చుకున్నారన్న అభియోగాలున్నాయి. అక్కడ వారు చెప్పిందే రాజ్యం, వారు చేసిందే శాసనం అన్నట్లుగా ఉండేది. ఆ సంస్థల నిధుల వినియోగం, ఉద్యోగాల నియామకం ఇలా ఏవీ బయటికి వచ్చేవి కావు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో జగన్ జమానాలో జిల్లా విద్య, వైద్య సంస్థల్లో జరిగిన అక్రమాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి. జిల్లాలో రిమ్స్, యోగివేమన యూనివర్శిటీ, వైఎస్సార్ ఆర్కిటెక్, పులివెందుల మెడికల్ కాలేజీ, ట్రిబుల్ ఐటీలు వైసీపీ నేతల ఉపాధికి కేరాఫ్‌గా మారాయనే ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. వైసీపీ చెప్పిన వారికే ఇక్కడ ఔట్‌సోర్సింగ్ లేదా నేరుగానే ఉద్యోగాలు ఇచ్చారని ప్రచారం ఉండేది. అప్పట్లో వచ్చిన ఆరోపణలన్నీ ఇప్పుడు నిజమని స్పష్టమవుతోంది. యోగివేమన యూనివర్శిటీలో తీసుకున్న దాదాపు 200 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ నియామకాలలో గోల్‌మాల్ జరిగిందని తెలుస్తోంది.



వైవీయూలో రోస్టరుకు విరుద్ధంగా చేపట్టిన నియామకాలు

- రోస్టర్, నోటిఫికేషన్ లేకుండానే ఉద్యోగ నియామకాలు
- ఎంపీ అవినాశ్, సజ్జల సిఫారసుతో పలువురికి ఉద్యోగాలు
- వైసీపీ హయాంలో సిఫారసులు, కాంట్రాక్టు పేరిట 200 మంది నియామకం

(కడప-ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్శిటీ 2006లో ప్రారంభమైంది. 2019 వరకు అక్కడ 245 మంది నాన్ టీచింగ్ స్టాఫ్ పనిచేసేవారు. జగన్ జమానాలో 2019 నుంచి 2024 మధ్య సుమారు 200 మంది నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించారు. అయితే ఇక్కడ చేపట్టిన నియామకాల్లో నో రోస్టరు, నో టెండరు. ఎంపీ అవినాశ్‌రెడ్డి, మాజీ సలహాదారుడు సజ్జల రామక్రిష్ణారెడ్డి సిఫారసు లేఖలు ఉంటే చాలు.. వెంటనే ఉద్యోగాలు ఇచ్చారని చెబుతారు. వైవీయూలో జరిగిన అక్రమ నియామకాల గుట్టు వ్యవహారం ఇప్పుడు బయటపడుతోంది. ఈ వ్యవహారంపై ఆంధ్రజ్యోతిలో 2019 అక్టోబరు 24న 'వైవీయూలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అమ్మేశారు' అనే కథనం ప్రచురితమైంది. అప్పట్లోనే ఈ అక్రమాల గుట్టును బయట పెట్టినా అప్పటి వైసీపీ పెద్దలు దీనిని పట్టించుకోలేదు.

ఆంధ్రజ్యోతి చెప్పింది అక్షర సత్యం

వైఎస్ జగన్ సీఎం అయ్యాక ప్రైవేటు ఏజెన్సీలు వద్దంటూ ఆప్కాస్‌ను తీసుకువచ్చారు. వైవీయూలో మాత్రం ప్రైవేటు ఏజెన్సీల ద్వారానే జూనియర్ అసిస్టెంట్లు, గార్డియన్లు, డ్రైవర్లు, ఇతరత్రా వాటి కోసం 76 మందిని నియమించుకోవాలని నిర్ణయించారు. ఇందు కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో కూడా జనరల్ మహిళ, బీసీ ఎస్సీ ఎస్టీ, వికలాంగులు.. ఇలా పొందుపరుస్తూ నోటిఫికేషన్ ఇచ్చారు. కేటగిరి ప్రకారం వారికే ఆ ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. ఉదాహరణకు బీసీ మహిళకు ఇస్తే బీసీ మహిళకే ఉద్యోగం ఇవ్వాలి. అప్పట్లో ఎవరూ లేకుంటే దానిని జనరల్ కేటగిరికి తీసుకురావాల్సి ఉంది. అయితే ఆ 76 ఉద్యోగ నియామకాల్లో 26 పోస్టుల్లో అసలు రోస్టరే లేదు. జనరల్ మహిళకు వచ్చిన చోట జనరల్ అభ్యర్థులకు, ఎస్టీ మహిళకు వచ్చిన చోట పురుషులు, బీసీ మహిళ వద్ద పురుషులు.. ఇలా అడ్డగోలుగా నియామకాలు చేపట్టారు. ఇలా 26 మందిని రోస్టరుకు సంబంధం లేకుండానే ఎంపిక చేశారు. వికలత్వ కోటాలో కూడా సకలాంగులను నియమించుకోవడం అప్పటి వైవీయూ అధికారులకే చెల్లింది.

'పీస్‌మెంటు' పేరుతో...

వైసీపీ హయాం అదోరకమైన యుగం. అప్పటి దాకా ఎవరికీ తెలియని కొత్తకొత్త విధానాలను అప్పుడే ప్రవేశపెట్టారు. వారికి కావాల్సిన వారి కోసం రకరకాల పోస్టులను సృష్టించారు. 'పీస్‌మెంటు' పేరిట డాక్టర్లు, నర్సులు ఐదుగురిని తీసుకున్నారు. ఇక్కడ నోటి ఫికేషన్ లేదు, రోస్టరు లేదు. వీరికి ప్రభుత్వ ఖజానా నుంచి జీతం చెల్లిస్తారు.

రోజువారి కూలీ పేరిట నియామకాలు

మనం ఇప్పటిదాకా రోజువారి కూలీ అంటే భవన నిర్మాణ పనులు, ఉపాధి హామీ పథకం, వ్యవసాయ పొలాలకు వెళ్లే కూలీలు, హోటల్స్‌లో పనిచేసే వారి గురించి విని ఉంటాం. అయితే మన ఘనత వహించిన వైవీయూలో జగన్ హయాంలో రోజువారి పేరిట 53 మందిని తీసుకోవడం గమనార్హం. ఇందులో జూనియర్ అసిస్టెంట్లు కూడా ఉన్నారు. ఇక మరుగుదొడ్ల కోసమంటూ సెక్యూరిటీకి సంబంధించి పలువురిని తీసుకున్నప్పటికీ ఇక్కడ కూడా రిజర్వేషన్లు పాటించకుండానే ఇష్టారాజ్యంగా అప్పటి వైవీయూ అధికారులు నియామకం చేపట్టడం గమనార్హం. అరుణాచలం సినిమాలో రజనీకాంత్ 'దేవుడు ఆదేశిస్తాడు, అరుణాచలం పాటిస్తాడు' అన్న డైలాగ్ పెద్దపాపులర్ అయింది. వైసీపీ హయాంలో కూడా వైసీపీ నేతలు ఆదేశిస్తారు. మేం పాటిస్తాం అనేలా వైవీయూ అధికారులు వ్యవహరించారు. అందుకే కొన్ని నియామకాలకు నోరోస్టరు, నో నోటిఫికేషన్.. ఓన్లీ వైసీపీ అన్నట్లుగా తయారైంది. ఇవన్నీ ఇప్పుడు ఒక్కొక్కటే వెలుగులోకి వస్తున్నాయి.

జమిలి ఎన్నికలు అనవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్.తులసిరెడ్డి

- ఎన్నికల ఖర్చుపేరుతో ఇలాంటి నిర్ణయాలు తగదు
- ఈవీఎంలు వద్దు.. బ్యాలెట్ పేపర్ ముద్దు
- ప్రత్యేక చర్చా కార్యక్రమంలో తులసిరెడ్డి

కడప (మారుతీనగర్), అక్టోబరు 19: నియంతృత్వ పోకడకు దారితీసే జమిలి ఎన్నికలు అనవసరమని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ముఖ్య అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికల అక్రమాలు, ఈవీఎంలు, జమిలి ఎన్నికల నిర్వహణ విధానంపై మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్ అధ్యక్షతన ప్రత్యేక చర్చాకార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలు పార్టీలు, ప్రజా సంఘాల, విద్యార్థి, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి, సంగటి మనోహర్ మాట్లాడుతూ దేశమంతటా లోక్‌సభతో పాటుగా అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపడం (జమిలి ఎన్నికలు) సాధ్యం కాదన్నారు. అందుకు ప్రధానంగా 18 రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉందన్నారు. రాజ్యాంగ సవరణ చేయాలంటే లోక్‌సభలో.. రాజ్యసభలో మూడింట రెండొంతుల మెజారిటీ ఉండాలన్నారు. మోదీ ప్రభుత్వానికి లోక్‌సభలో 69 సీట్లు, రాజ్యసభలో 43 సీట్లు తుక్కువ ఉన్నాయన్నారు. రాజ్యాంగ సవరణలు చేసి జమిలి ఎన్నికలు నిర్వహించాలనుకోవడం మన భారతీయ సంస్కృతికి పూర్తిగా విరుద్ధమన్నారు. పైపెచ్చు ఎన్నికల ఖర్చు తగ్గించడం కోసమేనంటూ మరోకొత్త నాటకానికి దేశ ప్రధాని నరేంద్రమోదీ తెరతీయడం సరైంది కాదన్నారు. మొత్తం బడ్జెట్‌లో ఎన్నికల ఖర్చు 0.02 శాతం మాత్రమే అన్నారు. అభివృద్ధి చెందిన అమెరికా దేశంలో కూడా జమిలి ఎన్నికలు లేవన్నారు. ఇదిలావుండగా అమెరికా, బ్రిటన్, తదితర అభివృద్ధి చెందిన దేశాలలో సైతం ఎన్నికలలో ఈవీఎంలకు బదులు బ్యాలెట్ పేపర్లు వాడుతున్నారని గుర్తుచేశారు. ఈవీఎంల విశ్వసనీయతపై పలువురు అగ్ర నేతలు పలు సందర్భాలలో అనుమానాలు వ్యక్తం చేశారన్నారు. ఈవీఎంలపై అనుమానాలు తొలగాలంటే ఎన్నికలప్పుడు వీవీ ప్యాట్ స్లిప్పులు ఓటర్ చేతిలోకి వచ్చి ఓటరు బాక్స్‌లో వేసే విధంగా మార్పు తేవాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు సయ్యద్ సలావుద్దీన్, అఫ్జల్‌ఖాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి, రాజారత్నం ఐజాక్, వైఎం ప్రతాప్‌రెడ్డి, సగిలి గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ @ సిద్దమ్మగారిపల్లె

- గ్రామంలో 50 మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులు
- స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి...
- మూడు తరాలుగా ఫుట్‌బాల్ క్రీడ వారసత్వం



2022లో ఆరోగ్యవరంలో విన్నర్స్. రన్నర్స్‌గా నిలిచిన సిద్దమ్మగారిపల్లె క్రీడాకారులు


సిద్దమ్మగారిపల్లె


ప్లాట్లుగా ఫుట్‌బాల్ క్రీడా మైదానం



జాతీయ క్రీడాకారులు నరేశ్, రిఖిల్

మదనపల్లె అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలంలోని పోతబోలులో చిన్నఊరు సిద్దంగారిపల్లె. మదనపల్లె పట్టణానికి కూతవేటు దూరంలో ఆ గ్రామం ఉంది. ఆ గ్రామస్తులకు మూడు తరాల నుంచి ఫుట్‌బాల్ క్రీడ వారసత్వంగా వస్తోంది. ఫుట్‌బాల్‌లో స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ప్రస్తుతం 50 మందికి పైగా ఫుట్‌బాల్ క్రీడాకారులున్న చిన్న పల్లె అది.

ఫుట్‌బాల్ క్రీడకు స్ఫూర్తి డాక్టర్ జెషోడియన్

మదనపల్లెకు 5 కిలోమీటర్ల దూరంలో క్షయవాధి నివారణ కేంద్రాన్ని 1910లో స్థాపించారు. ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌గా పేరు ఉన్నప్పటికీ శానిటోరియంగా ప్రసిద్ధికెక్కింది. ఇందులో సూపరింటెండెంట్‌గా డాక్టర్ జెషోడియన్ వచ్చారు. అనంతరం అతను ఫుట్‌బాల్ క్రీడాకారుడు కావడంతో మొదటగా సిద్దంగారిపల్లెకు చెందిన కాలవపల్లె గంగయ్య కుమారుడు జీకే వెంకటరమణ ఫుట్‌బాల్ ఆడడానికి సుముఖత చూపడంతో డాక్టర్ జెషోడియన్ తర్ఫీదు ఇవ్వడంతో ఆట మొదలైంది. చిన్నతనం నుంచే తండ్రి వద్ద బెంగళూరు నుంచి రబ్బర్‌బాల్ తెప్పించుకుని ఊళ్లో ఆడుకునేవారమని జీకే వెంకటరమణ తెలిపారు. ఆరోగ్యవరంలోని యుఎంటీఎస్ స్కూల్‌లో స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. 1956లోనే ఆరోగ్యవరంలో ఫుట్‌బాల్ గ్రౌండ్ ఏర్పాటు చేసి అక్కడ ఫౌండర్ జెషోడియన్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించారు. అనంతరం 1957-58లో ఆరోగ్యవరంలో జూనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. వెంకటరమణ సీనియర్ జట్టుతో వెళ్లి కడప, తిరుపతి ప్రాంతాల్లో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. బీటీ కళాశాలలో చదువుతున్న రోజుల్లో లీగ్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన యూనివర్సల్ ఇంటర్ కాల్ జట్టు తరఫున ఆడారు.

స్కూల్ గేమ్స్ నుంచి జాతీయ స్థాయికి...

సిద్దంగారిపల్లె క్రీడాకారులు స్కూల్ గేమ్స్ స్థాయి నుంచి జాతీయ ఫుట్‌బాల్ అండర్-14 జట్టుకు ఇద్దరు ఎంపికయ్యారు. గత నెలలో గౌహతిలో జరిగిన పోటీల్లో వీరు పాల్గొని ప్రతిభ చూపారు. సిద్దమ్మగారిపల్లెకు చెందిన కె.చెన్నకేశవులు, సుజాత కుమారుడు కె.నితీష్, ధనుంజయ, రెడ్డినాగేశ్వరి కుమారుడు ఎస్.రిఖిల్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరు స్కూల్ గేమ్స్‌తో పాటు ఇంటర్ జిల్లా స్థాయి జట్టులో క్రీడల్లో పాల్గొన్నారు. వైజాగ్, ఏలూరులో జరిగిన పోటీల్లో పాల్గొని అనంతపురం ఏపీ క్యాంపులో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14లో ఎ.సాయి కిరణ్ ఇంటర్ జిల్లా స్థాయిలో విశాఖపట్టణంలో ఆడి రాష్ట్ర స్థాయి క్రీడల్లో కూడా పాల్గొన్నారు. అలాగే డి.నరేష్ ఇంటర్ డిఫెన్స్ కళాశాల తిరుపతిలో చదువుతున్నాడు. ఇతను స్కూల్ గేమ్స్ అండర్-14, అండర్-17 జిల్లా స్థాయిలో కడప, కర్నూల్, నెల్లూరు, చిత్తూరులో జరిగిన పోటీల్లో పాల్గొన్నాడు. ఇంటర్ జిల్లా స్థాయిలో కర్నూల్‌లో విన్నర్‌గా నిలిచి జాతీయ స్థాయిలో అండమాన్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. వి.కార్తీక్ ఇంటర్ ఎస్వీ డిఫెన్స్ అకాడమీ తిరుపతిలో చదువుతున్నాడు. స్కూల్ గేమ్స్, జిల్లా స్థాయిలో క్రీడల్లో గెలుపొంది, కర్నూల్‌లో జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నారు.

ఇంటింటికి ఫుట్‌బాల్ క్రీడాకారులే

సిద్దమ్మగారిపల్లెలో మొత్తం 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి, ఇందులో ఇంటింటికి ఫుట్‌బాల్ క్రీడాకారులు ఉన్నారు. 50 మందికి పైగా ఈ ఊరిలో ఫుట్‌బాల్ క్రీడాకారులున్నారు. వీరు వారంలో ఒక్కరోజు ప్రాక్టీస్ కోసం హార్సిలీహిల్స్‌కు వెళతారు. వీరు మదనపల్లె మిషన్ కాంపౌండ్, పలమనేరు, చిత్తూరు. చింతామణి, కోలారు ప్రాంతాల్లో ప్రైవేట్ టోర్నమెంట్‌లో పాల్గొంటుంటారు. 2022లో ఆరోగ్యవరంలో జరిగిన టోర్నమెంట్ స్వరాజ్ క్రీడా పోటీల్లో ఎ-జట్టు విన్నర్స్, బి.జట్టు రన్నర్స్‌గా సిద్దమ్మగారిపల్లె క్రీడాకారులే నిలిచారు.

మూడు తరాల నుంచి...

మొదటి తరంలో జీకే వెంకటరమణ ఫుట్‌బాల్ ఆడగా ఆయన కుమారుడు కె.చెన్నకేశవులు (48) జాతీయ స్థాయిలో కేరళలోని ఆలూవాలో, 2000 సంవత్సరంలో బీటీ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ కాల్ జట్టులో పుత్తూరులో నిర్వహించిన క్రీడల్లో విన్నర్‌గా నిలిచారు. మూడో తరం చెన్నకేశవులు కుమారుడు కె.నితీష్ ప్రస్తుతం జాతీయ స్థాయిలో అస్సాంలో జరిగిన ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొన్నాడు.

గ్రౌండ్‌కు స్థలం కేటాయించాలి

సిద్దమ్మగారిపల్లె సమీపంలో గతంలో క్రీడా మైదానం ఉండేది. అక్కడ 6, 7 టీములతో 9 టోర్నమెంట్లు నిర్వహించారు. అది ఇప్పుడు అన్యాక్రాంతమై వైసీపీ పాలనలో వెంచర్ వేసి ప్లాట్స్‌గా మార్చేశారు. ఆరోగ్యవరంలో క్రీడా మైదానం ఉండేది. అక్కడ కూడా జాతీయ రహదారికి క్రీడామైదానం పోవడంతో ప్రాక్టీస్ కోసం ఇబ్బందులు పడుతున్నామని క్రీడాకారులు చెబుతున్నారు. కావున పల్లె వద్ద క్రీడా మైదానానికి స్థలం కేటాయించాలని క్రీడాకారులు కోరుతున్నారు. ఇదే గ్రామంలో భద్రయ్య ఫిజికల్ డైరెక్టర్‌గా నిమ్మనపల్లెలో పనిచేస్తున్నారు. అలాగే శ్రీవేద స్కూల్‌లో పీఈటీగా మహేష్ పనిచేస్తూ ఇక్కడ యువతకు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం గ్రౌండ్‌కు స్థలం కేటాయిస్తే జాతీయ స్థాయి నుంచి ప్రపంచ స్థాయికి కూడా క్రీడాకారులను తయారు చేస్తామని కోచ్ మహేష్ చెబుతున్నారు.


చాలామందిని తయారు చేస్తా



సిద్దమ్మగారిపల్లె నుంచే చాలామందిని క్రీడాకారులను తయారు చేస్తాను. ఇప్పటికే కోచ్‌గా వ్యవహరించడంతో యువత చాలా ఉత్సాహంగా ఉన్నారు. క్రీడల ప్రాక్టీస్ కోసం మైదానం లేక ఇబ్బందులు పడుతున్నాం. మైదానానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలి.

-మహేష్, ఫుట్‌బాల్ కోచ్, సిద్దమ్మగారిపల్లె

జెషోడియన్ స్ఫూర్తిగా...



చిన్నతనం నుంచి ఫుట్‌బాల్ అంటే చాలా ఇష్టం. మా తండ్రి వద్ద రబ్బర్‌బాల్ తెప్పించుకుని ఆడుకునేవాడిని. స్కూల్‌లో చేరిన తరువాత డాక్టర్ జెషోడియన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఫుట్‌బాల్ నేర్చుకున్నా. అప్పటిలో కళాశాల స్థాయిలో ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నా.

- జీకే వెంకటరమణ, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు, సిద్దమ్మగారిపల్లె

మూడుసార్లు హాజరు వేయాలి

- కలెక్టర్ ఆదేశాలు



కలికిరి, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులందరూ ప్రతిరోజూ తప్పనిసరిగా మూడు పర్యాయాలు హాజరు నమోదు చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శనివారం ఎంపీడీవోలతో జరిగిన టెలీ కాన్ఫరెన్సులో ఈ మేరకు అధికారులకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సచివాలయాల ఉద్యోగుల హాజరు నమోదుకు ఆయా పంచాయతీ కార్యదర్శులే బాధ్యత వహించాలని, అదేవిధంగా కార్యదర్శులు కూడా తమ హాజరు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనివేళల్లో ప్రతి రోజూ ఉదయం 10.30 గంటలలోగా ఒకసారి, మధ్యాహ్నం రెండో దఫా, సాయంత్రం 5 గంటలకు మూడోసారి హాజరు వేయాలని సూచించారు. దీనిని ప్రతిరోజూ ఎంపీడీవోలు సమీక్షించాలని కూడా కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా సెలవుపై వెళ్లదలిచే సచివాలయ ఉద్యోగులు సంబంధిత కార్యదర్శి, ఎంపీడీవోకు సమాచారం అందజేసి ముందస్తు అనుమతి తీసుకోవాలని కూడా కలెక్టర్ స్పష్టం చేశారు. రోజువారీ హాజరుపై ఉద్యోగులు నిర్లక్ష్యం పాటిస్తే కఠిన చర్యలకు గురవుతారని కూడా వివరించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేసేందుకు తగు చర్యలు తీసుకోవలసింది పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవోలు ఆదేశించారు.


పసుపు రిబ్బన్లతో విధులకు...


పసుపు రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు

వాల్మీకిపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని వాల్మీకిపురంలో జూనియర్ కళాశాల కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. శనివారం వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ విషయంలో కాలయాపన చేసి ఎన్నికల జీవోల పేరుతో సమస్యలను పరిష్కరించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంట్రాక్టు లెక్చరర్లు స్వప్న, కళావతి, లక్ష్మీదేవి, నందిని, ప్రసాద్‌కుమార్, జానీ, పరమేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్, రమణ్య, నరసింహులు, రాజగోపాల్‌రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ ఆలయ హుండీ లెక్కింపు


రెడ్డెమ్మ ఆలయ హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

గుర్రంకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మ ఆలయ హుండీని దేవదాయ శాఖాధికారులు శనివారం లెక్కించారు. అమ్మవారి హుండీని ప్రతి మూడు నెలలకు ఒకసారి లెక్కిస్తారు. ఈ నేపథ్యంలో అమ్మవారి హుండీ ద్వారా రూ.7,00,175 నగదు, 16 గ్రాముల బంగారం, 169 గ్రాముల వెండి వచ్చినట్లు దేవదాయశాఖ తనిఖీ అధికారి శశికుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈవో మంజుల, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి అమరవీరుల వారోత్సవాలు

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి యేటా పోలీసు అమరులను స్మరించుకుంటూ నిర్వహించే పోలీసు అమరవీరుల వారోత్సవాలు ఈనెల 21 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ వారోత్సవాలు నిర్వహించనున్నారని తెలిపారు. ఈ నెల 21న అమరవీరుల స్మృతి పరేడ్, పోలీసు అమరులకు నివాళులు ఉంటాయన్నారు. 22 నుంచి 30వ తేదీ వరకు పోలీసు అమరుల గ్రామాలను సందర్శించి పోలీసు అమరుల సేవలను వివరిస్తారన్నారు. అలాగే వారు చదివిన పాఠశాలలకు వెళ్లి అమరుల ఫొటోలు పెట్టుకునేలా సూచించడం ఆ గ్రామంలో ఏదైనా రోడ్డు, తదితర అభివృద్ధి పనులకు అమరుల పేర్లు పెట్టేలా గ్రామస్తులకు సూచనలిస్తారన్నారు. 30న పోలీసు అమరుల కుటుంబాల్లోని వారికి సన్మానం, వారి సేవలను ప్రశంసించనున్నామన్నారు. 31న జిల్లా వ్యాప్తంగా సమైక్యతా దినం సందర్భంగా ఉదయం యూనిటీ రన్, సాయంత్రం క్యాండిల్ ర్యాలీతో పోలీసు అమరవీరుల వారోత్సవాలు ముగియనున్నాయని తెలియజేశారు.

హత్య కేసు మిస్టరీ వీడేనా?

- వివాహేతర సంబంధమే కారణమా...


ఖాదర్‌బాషా (ఫైల్)

కురబలకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట సమీపంలో యువకుడు హత్యగురైన సంఘటన కలకలం రేగింది. శుక్రవారం రాత్రి హత్యకు గురైన యువకుడి హత్య కేసు మిస్టరీ పోలీసులకు ఛాలెంజ్‌గా మరింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కురబలకోటకు చెందిన వి.బాబ్జి కుమారుడు ఖాదర్‌బాషా (26) గత రెండేళ్ళ క్రితం బతుకుదెరువు నిమిత్తం కువైత్‌కు వెళ్లి తిరిగొచ్చాడు. కాగా గ్రామంలో అతను చింతపండు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిండేవాడని స్థానికులు చెబుతున్నారు. కాగా ఇటీవల ఆ మహిళ భర్త కువైత్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ఈ విషయాన్ని అతడికి కొంతమంది స్థానికులు తెలియజేయడంతో హత్యకు పథకం పన్నాడు.

దీంతో కొంతమందికి ఖాదర్‌బాషా హత్యకు డీల్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న అతడికి ఫోన్ రావడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లగా కొంతమంది అతడిని బలవంతంగా తీసుకెళ్లారని కుటుంబీకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని డంపింగ్ యార్డు వద్ద కిరాతకంగా హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా హత్య జరిగిన సంఘటనా స్థలంలో మద్యం బాటిల్, గ్లాసులు, ఒక మహిళ చెప్పు ఉండటంతో హంతక ముఠాలో మహిళ ఎవరైనా వారికి సహకరించారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని విచారించడంతో పాటు డాగ్ స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు నిర్వహించారు. కాగా యువకుడి హత్యకు సంబంధించి పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.యువకుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు ఈనెల 31వ తేదీతో గడువు ముగుస్తుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి, ఓపెన్ స్కూల్స్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలకు గడువు పెంచాలంటూ అన్ని వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్స్ డైరెక్టర్ నాగేశ్వరరావు స్పందించి ముగిసిన గడువును ఈనెల 31వ తేదీ వరకు పొడిగించాలని తెలిపారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని, ఈనెల 30, 31వ తేదీల్లో రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. ఈనెల 31వ తేదీ తర్వాత ఎటువంటి పరిస్థితుల్లో కూడా ఓపెన్ స్కూల్స్ ప్రవేశాలకు గడువు పెంచడం జరగదన్నారు.

ఓపెన్ స్కూల్స్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్‌లలో ప్రవేశం పొందాలనుకునే వారు సమీపంలోని ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రం ద్వారా గానీ, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా గానీ, జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ద్వారా గానీ సంప్రదించి ప్రవేశం పొందవచ్చునని వారు తెలిపారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు రాయచోటి విద్యార్థి



వెంకటసాయి

రాయచోటిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దివ్యతేజ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి వెంకటసాయి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18న కడప పట్టణంలోని స్పోర్ట్స్ పాఠశాలలో అండర్-17 విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపర్చి కడప జిల్లా జట్టు తరఫున రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు హిందూపూర్‌లో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో వెంకటసాయి పాల్గొంటారని ఆయన తెలిపారు.

సామాన్యుడి నుంచి

సౌత్ కొరియా వరకు..



- దక్షిణ కొరియాలో ప్రభుత్వ ఉద్యోగం పొందిన.. మొట్టమొదటి విదేశీ సైంటిస్ట్ రాజేశ్‌కుమార్
- యువ సైంటిస్టులకు ఆదర్శం
- ప్రపంచ దేశాల్లో పేరు ప్రఖ్యాతులు

బద్వేలు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు పట్టణం రెడ్డయ్యమఠం వీధిలో నివసించే జ్యోతి రెడ్డప్ప, నాగరాజమ్మ దంపతులకు మొదటి సంతానం రాజేశ్‌కుమార్. ఈయనకు ఓ తమ్ముడు మహేశ్‌కుమార్, చెల్లెలు భవానీ ఉన్నారు. తమ్ముడు మహేశ్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. సోదరి భవానీ గృహిణిగా స్థిరపడ్డారు.

అవరోధాలు అధిగమించి

రాజేశ్‌కుమార్ బాల్యమంతా కష్టాల కడలిలోనే సాగింది. కాన్వెంటుల్లో చేరే ఆర్థిక స్థోమత లేక పదో తరగతి వరకు బద్వేలు జడ్పీ బాయిస్ హైస్కూలులో చదువుకున్నారు. ఇంటర్, డిగ్రీ కూడా బద్వేలులోనే పూర్తి చేశారు. ఆ తరువాత పీజీ చేసేందుకు తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో చేరినప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అయ్యేవారు. కానీ ఉన్నత చదువులు దదవాలన్న సంకల్పాన్ని వీడలేదు. ఎస్వీ యూనివర్శిటీలో పీజీ పూర్తి చేసిన వెంటనే పీహెచ్‌డీ చేయాలనుకున్నారు. అందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. అయితే ఎస్వీ యూనివర్శిటీలో ప్రొఫెసరుగా పనిచేస్తున్న వరదారెడ్డి చేయూతనందించారు. పీలేరు జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా ఉద్యోగం ఇప్పించారు. దీంతో ప్రతి రోజూ తిరుపతి నుంచి పీలేరు వెళుతూ అక్కడి కళాశాలలో కాంట్రాక్టు లెక్చరర్‌గా పనిచేశారు. సాయంత్రం వేళల్లో ఎస్వీ యూనివర్శిటీలో పనిచేసే ప్రొఫెసర్ల పిల్లలకు ఇంటి వద్దకు వెళ్లి ట్యూషన్లు చెబుతూ అనేక కష్టనష్టాలు ఎదుర్కొని అనలిటికల్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ పూర్తి చేశారు.


జర్మనీకి చెందిన ప్రముఖ ప్రొఫెసర్ భర్త్‌తో చర్చిస్తున్న రాజేశ్‌కుమార్

ఉద్యోగాల వేట

పీహెచ్‌డీ పూర్తి చేసిన వెంటనే రాజేశ్‌కుమార్ ఉద్యోగాల వేటలో పడ్డారు. అయితే 2006లో అమెరికాలో, 2007లో జపాన్‌లో ఉద్యోగాలు పొందినా అక్కడి పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఇండియాకు తిరిగి వచ్చేశారు.


దక్షిణకొరియాలో ప్రభుత్వ కొలువు


2007 చివరిలో దక్షిణ కొరియాలో కొరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జియో సైన్స్‌అండ్ మినరల్స్ స్సోర్స్‌లో ఉద్యోగాన్ని పొందారు. ఈయన జీవితంలో అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. దక్షిణకొరియా ఏర్పడిన 90 సంవత్సరాల కాలంలో అక్కడి ప్రభుత్వంలో పర్మినెంట్ ఎంప్లాయిగా ఎంపిక చేసుకున్న మొట్టమొదటి విదేశీయుడు మన భారతీయుడైన రాజేశ్‌కుమార్.

మైలురాళ్లు..

దక్షిణ కొరియాలో పనిచేస్తూనే 14 దేశాల్లో వారి ఆహ్వానం మేరకు కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొని తన పరిశోధన పత్రాలను సమర్పించారు. 2005లో పీహెచ్‌డీ సమయంలో 2005 బెస్ట్ రీసెర్చ్ స్కాలర్ అవార్డు పొందారు. 2010లో భారతదేశానికి సంబంధించి శాస్త్ర పరిశోధన రంగంలో యువ శాస్త్రవేత్త అవార్డును ఢిల్లీలో అందుకున్నారు.

బ్రిటన్ దేశానికి సంబంధించి లండన్‌లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన రాయల్ సొసైటీ సంస్థలో సభ్యత్వాన్ని కూడా పొందారు. ఈయనవి ఇప్పటి వరకు దాదాపు 70 వరకు పరిశోధనా పత్రాలు ఇంటర్నేషనల్ కెమిస్ట్రీ వ్యాల్యుమ్స్‌లో ప్రచురించారు. వాటికి సంబంధించి రాజేశ్ పేటెంట్ రైట్స్ కూడా పొందారు. రాజేశ్ కుమార్ కెమిస్ట్రీపై తాను చేసిన పరిశోధన అంశాల పుస్తకాలు అమేజాన్‌లో అందుబాటులో ఉన్నాయి. యువ సైంటిస్టులకు ఇవి దిక్సూచిలా పనిచేస్తున్నాయి.





రాజేశ్‌కుమార్ సైన్స్‌పై ప్రచురించిన పుస్తకాలు

ఫ్లోరైడ్‌పై పరిశోధనలు

18 సంవత్సరాల పాటు దక్షిణ కొరియాలో సైంటిస్ట్‌గా పనిచేశాను. ప్రస్తుతం ఆస్ట్రేలియాలోని ఇండియా-ఆస్ట్రేలియా పార్టనర్‌షిప్ ప్రోగ్రాంలో సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తున్నా. త్వరలోనే భారతదేశానికి వచ్చి ఫ్లోరైడ్ రహిత నీటి కోసం పరిశోధనలు జరిపి పుట్టి పెరిగిన మాతృ దేశ రుణాన్ని తీర్చుకుంటాను. నేను సాధించిన విజయాల్లో సోదరుడు మహేశ్‌కుమార్, కుటుంబ సభ్యుల సహకారం ఉంది.

- రాజేశ్‌కుమార్, సీనియర్ సైంటిస్ట్



కొబ్బరికాయల వేలంతో రూ.80లక్షల ఆదాయం

చక్రాయపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం దేవస్థాన సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో కొబ్బరికాయలు విక్రయం వేలం నిర్వహించారు. దీంతో గండికి రూ.80లక్షల ఆదాయం వచ్చింది. శనివారం రూ.10లక్షల డిపాజిట్ కట్టి కొబ్బరికాయల వేలం నిర్వహించగా దాదాపు 10 మంది గుత్తేదారులు పాల్గొన్నారు. వేంపల్లె వాసి వెంకటరమణారెడ్డి రూ.80లక్షలకు పాట దక్కించుకున్నాడు. కొబ్బరికాయల వేలంతో వచ్చిన ఆదాయం రూ.80లక్షలకు జీఎస్టీ 18శాతం కలిపి ఒకేసారి చెల్లించాలని ఈఓ కోరారు. జీఎస్టీతో కలిపి రూ.94లక్షలు చెల్లించాల్సి ఉండగా సగం చెల్లించారు. మిగిలిన సొమ్ము బ్యాంక్ గ్యారెంటీతో గడువు కోరారు. ఏదేమైనా రికార్డుస్థాయిలో గండికి ఆదాయం రావడం విశేషం. దేవాదాయ జిల్లా అధికారి ఇన్‌స్పెక్టర్ శివయ్య, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీచైర్మన్ వెంకటస్వామి, భాస్కర్, సీఐ నాగరాజు, ఎస్ఐ కృష్ణయ్య, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజా ఫౌండేషన్ సందర్శించిన జడ్జి

● విద్యార్థులకు పండ్లు పంపిణీ


విద్యార్థులకు పండ్లు అందిస్తున్న జడ్జి భార్గవి

జమ్మలమడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి మైలవరం రాజా ఫౌండేషన్ (డాడీహోం) సందర్శించారు. శనివారం ఆమె వృద్ధులు, అభాగ్యులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. డాడీహోంలో పనిచేస్తున్న రాధా, కవిత సేవలను జడ్జి అభినందించారు. సేవలు చేస్తున్నవారిని, విద్యార్థులను సందర్శించి పలకరించడం చాలా సంతోషం కలిగిస్తోందన్నారు. ఆహారం విషయంలో జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం మైలవరం మండలం దొమ్మరనంద్యాల బీసీ హాస్టల్, మైలవరంలోని బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. న్యాయవాదులు జంబాపురం మహేశ్వరి, జ్యోతి, పెద్దిరాజు, ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైవీయూ అధ్యాపకులతో అంతర్జాతీయ ప్రాజెక్టు


ప్రాజెక్టు పత్రాలను తీసుకుంటున్న వైవీయూ అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో ఇద్దరు ప్రొఫెసర్లకు అమెరికా వాషింగ్టన్‌లోని హెల్త్ సొసైటీ పార్టనర్ సంస్థ ప్రాజెక్టు మంజూరు చేసింది. వృక్షశాస్త్ర ప్రొఫెసరు చంద్ర ఓబుళరెడ్డి, బయోటెక్నాలజీ ప్రొఫెసరు చంద్రశేఖర్ ప్రాజెక్టు పత్రాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి ద్వారా అందుకున్నారు. మొక్కల సైన్స్‌పై పనిచేస్తున్న శాస్త్రవేత్తలకు ఇచ్చే శిక్షణ, విధివిధానాలకు వీరు రూపకల్పన చేస్తారు. శాస్త్రవేత్తలు సమగ్ర జీవభద్రత శిక్షణను అభివృద్ధి చేయడానికి వీరు కృషి చేస్తారు. అంతర్జాతీయస్థాయిలో ప్రాజెక్టు ఫలితాలు అమలు చేయనున్నారు. వైవీయూ ప్రొఫెసర్లకు అంతర్జాతీయ స్థాయి లభించడం పట్ల వైస్‌ఛాన్సలరు, ప్రిన్సిపాల్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో ఐక్యు ఏసీ సంచాలకులు డాక్టర్ సుబ్రమణ్యంశర్మ, ప్రొఫెసరు గంగిరెడ్డి, డాక్టర్ గోవర్ధనరెడ్డి, దూర విద్య ఉపసంచాలకులు డాక్టర్ శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్


విలేజ్ క్లినిక్ పరిశీలనలో టాస్క్‌ఫోర్స్ అధికారులు

బి.కోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మేకవారిపల్లె పీహెచ్‌సీని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎస్‌ఓస్టాటస్టికల్ ఆఫీసర్ రమేశ్ రెడ్డి, డీపీఓ కుమార్‌నారాయణ, డీపీహెచ్ ఎన్ఓ అరుణ్ కుమారి, ఏఎస్ఓ జాకబ్ తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ మాతా శిశు మరణాలను తగ్గించాలని ప్రసవానికి హాస్పిటల్‌కు తీసుకురావాలని బిడ్డకు బిడ్డకు ఎడమ ఉండాలని, రక్తహీనత తగ్గించాలని, కౌమార దశ విద్యార్థినులకు (బాలికలకు) హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించి హెచ్‌బీ తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు డబుల్‌డోస్ ఇవ్వాలని సూచించారు. వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు మాట్లాడుతూ ఇటీవల నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్‌లో రాష్ట్రంలో తంగేడుపల్లె విలేజ్ హెల్త్ క్లినిక్ మొదటిస్థానంలో నిలిచిందని గర్భిణులు, చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు సకాలంలో అందించాలని హైరిస్క్ గరిణులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సీహెచ్ఓ నాగమణి, సీహెచ్ఎన్ పుష్పాంజలి, హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం, విజయలక్ష్మీ, సీహెచ్ఓ, ఏఎన్ఎంలు, ఎఫ్‌హెచ్ఓలు, హెల్త్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

నాక్‌పీర్ చైర్మన్‌గా ప్రొఫెసరు శ్రీనివాసులు



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూ ఎకనామిక్స్ ప్రొఫెసరు శ్రీనివాసులు నేషనల్ అసెస్‌మెంటు అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ పీర్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ బృందం కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ప్రముఖ మహాత్మాగాంధి డిగ్రీకళాశాలను 23, 24తేదీల్లో సందర్శించనున్నారు. ఈ బృందానికి సమన్వయ కర్తగా డాక్టర్ ఎస్ఆర్ మోహన్ వ్యవహరించనున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రొఫెసర్లు మెంబరు కోఆర్డినేటరు మెంబర్లుగా ఉన్నారు. ఆయన ఎంపిక పట్ల వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ, అధ్యాపకులు అభినందించారు.

ఎమ్మార్కే కళాశాలను సందర్శించిన వీసీ


సిబ్బందితో మాట్లాడుతున్న వీసీ విశ్వనాథకుమార్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్‌ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ అనుబంధ కళాశాలలైన భీమవరం ఎమ్మార్కే కళాశాలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాథకుమార్ శనివారం సందర్శించారు. కళాశాలలోని విద్యాప్రమాణాలు, సౌకర్యాలు పరిశీలించారు. విద్యార్థులతో సమావేశమై కళాశాల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు.

సమష్టి కృషితో కళాశాల అభివృద్ధి : ఆర్‌జేడీ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో కళాశాల అభివృద్ధికి పాటుపడాలని ఆర్‌జేడీ డాక్టర్ గిరి అన్నారు. శనివారం కడప నగరం కోటిరెడ్డి మహిళా కళాశాలను సందర్శించిన ఆయన ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమై కళాశాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధ్యాపకుల సామర్థ్యం మెరుగుపరచుకుంటూ నూతన పోకడలను అనుసరిస్తూ విద్యార్థులకు విద్య, ఉద్యోగపరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డేకి ఆర్‌జేడీ హాజరయ్యారు. విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

98 పరుగులకే కుప్పకూలిన వెస్ట్ గోదావరి

6 వికెట్ల నష్టానికి 112 పరుగులతో ఈస్ట్ గోదావరి

కడప (స్పోర్ట్స్) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీడే ఇంటర్ డిస్ట్రిక్ట్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లో శనివారం జరిగిన రెండు వేర్వేరు మ్యాచ్‌లలో వెస్ట్ గోదావరి జట్టు కేవలం 98 పరుగులకే కుప్పకూలింది. మరో మ్యాచ్‌లో ఈస్ట్ గోదావరి జట్టు 6 వికెట్లు కోల్పోయి 112 పరుగులు మాత్రమే చేసింది.

● నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు- వెస్ట్ గోదావరి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన వెస్ట్ గోదావరి జట్టు బ్యాటింగ్‌కు దిగి 76.1 ఓవర్లలో కేవలం 98 పరుగులకే కుప్పకూలింది. ఇందులో టి. శ్రీ సూర్యసాయిమణికంఠ (బ్యాటర్) 94 బంతుల్లో 17 పరుగులు చేయడం విశేషం.

● నగర శివారు ప్రాంతం కేఓఆర్ఎం మైదానంలో ఈస్ట్‌గోదావరి - ప్రకాశం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన ఈస్ట్ గోదావరి జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 41.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసింది. ఇందులో రాజ్‌ఆర్యన్ (బ్యాటర్) 22 పరుగులు, రేవంత్ (బ్యాటర్) 32 పరుగులు చేశారు. కాగా రెండో రోజైన ఆదివారం ఆటకు చివరిరోజు.

రోడ్లు జలమయం - ప్రగతికి గ్రహణం

చినుకుపడితే రోడ్లు బురద మయం ● రూ.130 కోట్లలో సగం కూడా ఖర్చుకాని వైనం
అవస్థలుపడుతున్న జనం ● ప్రజాప్రతినిధులు హీనం


జలమయమైన మైదుకూరురోడ్డు

బద్వేలుటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బద్వేలు రోడ్లు దయనీయంగా మారాయి, వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 130 కోట్ల ప్రగతికి గ్రహణం పట్టింది. మూడు పంచాయతీలుగా ఉన్న బద్వేలు మున్సిపాలిటీగా పురోగతి చెంది 14 ఏళ్లు దాటి రెండు పాలకవర్గాలుపూర్తయి, మూడో పాలకవర్గంలో నడుస్తున్నా వార్డుల్లో రహదారులు, మురుగు కాల్వలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. చినుకు పడితే ప్రధాన వార్డుల్లో రహదారులపై సైతం వర్షపునీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంటాయి. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. నియోజకవర్గం అభివృద్ధి కోసం మంజూరైన రూ. 130 కోట్లు నిధులు ఏమయ్యాయో ఎవరికీ అంతు చిక్కడం లేదు. అధికారులను అడిగితే సగం నిధులు ఖర్చయ్యాయని చెప్పు కొస్తున్నారు. ప్రజలు మురుగు తో సావాసం చేస్తున్నట్లే వివరాల్లోకెళితే....

మురుగునీరుపారితే...

చిన్నపాటి వర్షం కురిసినా నీరు, మురుగునీరు రోడ్లపై ప్రవహించడం సర్వసాధారణమైంది. కొన్నిచోట్ల కాల్వల్లో పూడికతీత తీయకపోవడం, మరికొన్నిచోట్ల మురుగు కాల్వలు లేకపోవడంతో వర్షంనీరు, మురుగునీరు పోయే మార్గం లేకపోయింది. దీనికితోడు మురుగు కాల్వల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర పదార్థాలు పేరుకుపోయాయి. బ్రహ్మంసాగర్ తాగునీటి పథకం ద్వారా వచ్చే నీరు వృథాగా రోడ్లపై ప్రవహిస్తోంది. పబ్లిక్ వాటర్, మురుగునీరు నిత్యం రోడ్లపై దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలు దోమలు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు.

పట్టించుకున్న నాథుడేలేడు

ప్రజా సమస్యలను పాలకవర్గం, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వర్షాకాలం వచ్చిందంటే మురుగుకాల్వల్లో మురుగునీరు, వర్ష పునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దుర్వాసన వస్తోంది. దీనికితోడు ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.

సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, శివానగర్‌వాసి

మున్సిపాలిటీలో మొత్తం 35వార్డుల్లో 58కిలోమీటర్ల మేరకు డ్రైనేజీ కాల్వలు పూర్తిచేయాల్సి ఉండగా వాటిల్లో కొంత మేరకు అంతంత మాత్రమే పూర్తి చేశారు. రూ.130కోట్ల నిధుల్లో రూ.47కోట్లు మాత్రమే ఖర్చుచేయడంతో పట్టణ అభివృద్ధికి గ్రహణం పట్టినట్లైంది. గతంలో జనావాసాలు లేనిచోట్ల వైసీపీ నేతలు పొలాలకు, వారి స్థలాలున్నచోట్ల సీసీ రోడ్లను ఏర్పాటు చేసుకున్నారు. జనావాసాలున్నచోట్ల అభివృద్ధిని గాలికి వదిలేయడంతో రోడ్లు, కాల్వలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఇప్పటికైనా అధికారులు, మున్సిపాలిటీ పాలకవర్గం అభివృద్ధి పనులను ప్రారంభించి మురుగు కాల్వలు, రోడ్లనిర్మాణ పనులను చేపట్టి మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.


రెడ్డెయ్యమఠం వీధిలో అధ్వానంగా రహదారులు


శివానగర్‌లో అధ్వానంగా సీసీరోడ్లు, మురుగు కాల్వలు

పన్నులు కట్టించుకుంటారే తప్ప...

పన్నుల వసూళ్లపై పెట్టే శ్రద్ధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై పెట్టకపోతున్నారు. మురుగు కాల్వల్లో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రజా ప్రతినిధులు ఎన్నికల సమయంలో తప్ప సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదు.

నాగరాజు, శివానగర్‌వాసి

రూ. 10 లక్షల బకాయిలపై ఆరా

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ ● రికవరీ జరగకపోతే చట్టపర చర్యలు
స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్


ఎగువగొట్టివీడులో విచారణ చేస్తున్న అధికారులు

గాలివీడు, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): స్త్రీనిధి సొమ్ము స్వాహాపై విచారణ చేస్తున్నట్లు స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎగువగొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో స్త్రీనిధి బకాయిలపై విచారణ జరిపారు. మండలంలో మొత్తం రూ.10 లక్షల వరకు బకాయిలు ఉండగా అందులో అత్యధికంగా గొట్టివీడు గ్రామం గొల్లపల్లెలో స్త్రీనిధి సొమ్ము రూ.4.15 లక్షల బకాయిలు ఉన్నాయన్నారు. ఇదే విషయమై మహిళా సంఘ సభ్యులను విచారించగా ఇప్పటికే చాలా వరకు బకాయిలు చెల్లించామని, అయినా ఎక్కువ మొత్తంలో అప్పు చూపిస్తున్నట్లు ఆరోపిస్తున్నారన్నారు. అయితే అవి బకాయిలా లేక వెలుగు సిబ్బంది చేతివాటంతో నిలిచిపోయిన అప్పా అనే విషయం క్షేత్రస్థాయిలో రసీదులు, బుక్కులు క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉందన్నారు. మండలంలో గుండ్లచెరువు రూ.80,900, సీసీ పల్లె రూ.65 వేలు, తూముకుంట రూ.29,500, అరవీడు రూ.32,000 బకాయిలు ఉన్నాయన్నారు. శనివారం జరిగిన విచారణలో రూ.1,20,000 రికవరీ కాగా అందులో గుండ్లచెరువు నుంచి రూ.30 వేలు, నూలివీడు రూ.75 వేలు, పూలుకుంట రూ.15 వేలు ఉన్నట్లుగా తెలిపారు. విచారణ అధికారులు పారదర్శకంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి స్వాహా అయిన స్త్రీనిధి సొమ్మును రికవరీ చేసి, కారకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ మౌనిక, లీగల్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఏపీఎం పెద్దరెడ్డెయ్య, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

24న అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్‌పోటీలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూ అంతర్ కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలు 24న బద్వేలు బిజివేముల వీరారెడ్డి కళాశాలలో నిర్వహిస్తున్నట్లు బోర్డు సెక్రటరీ రావసుబ్బారెడ్డి తెలిపారు. బ్యాడ్మింటన్ సింగిల్స్ డబల్స్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టరు సంతకం చేసిన ఎలిజబులిటీ ఫాం, కళాశాల ఒరిజినల్ సర్టిఫికెట్‌పై ఫొటోపై అటెస్టేషన్ చేయించాలన్నారు. టెన్త్, ఇంటర్ మార్కులజాబితా ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని, క్రీడాకారులు జూలై 1, 2024 నాటికి 17 నుంచి 25 ఏళ్ల వయసు కలిగిఉండాలన్నారు. ఇతర సమాచారం కోసం 9000294626, 9705459052 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

● రూ.6 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం : డీఎస్పీ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

రాయచోటిటౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): అంతర్‌జిల్లా దొంగలను అరెస్టు చేసి ఆరు లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కృష్ణమోహన్ తెలిపారు. రాయచోటి అర్బన్ పోలీసు స్టేషన్‌లో వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు. నెల్లూరు జిల్లా కావలి వాసి నడింపల్లి గోపీ, నెల్లూరు పట్టణం గుడిపిల్లపాడు ప్రాంతం లక్ష్మీగణపతి వీధికి చెందిన లింగుబెరి రాంబాబు జూన్ 30న పట్టణంలోని లక్ష్మీపురంలో రెండు ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీపై కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం వారిని అరెస్టు చేసి, రూ.6 లక్షల విలువైన 86.500 గ్రాములు బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కనిగిరి, వేదాయపాలెం, యలమంచిలి, నెల్లూరు, పత్తిపాడు, సింగరాయకొండ, జలదంకి, పొదలి, కావలి, చిలకపూడి, పామూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో చోరీ కేసులు నమోదైనట్లు వివరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు నరసింహారెడ్డి, అబ్దుల్‌జహీర్, పోలీసు సిబ్బంది రామచంద్ర, బరకతుల్లా, మహేందరనాయుడు, పెంచలయ్య, మహేంద్ర, టెక్నికల్ అనాలసిస్ వింగ్ కానిస్టేబుల్ రవి తదితర సిబ్బందిని అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం


విరాళం అందిస్తున్న శ్రీనివాసులు

చక్రాయపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం వేంపల్లె వాసి చెల్లుబోయిన శ్రీనివాసులు వారి ధర్మపత్ని మల్లమ్మ రూ.1,00,516 విరాళంగా ఇచ్చారు. టెంకాయలు విక్రయించే దుకాణంలో పనిచేసే వ్యక్తి విరాళమివ్వడం అభినందనీయమని సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య అన్నారు. మాజీ చైర్మన్ వెంకటస్వామి, ఉపప్రధాన అర్చకులు రాజారమేష్ ఆలయ మర్యాదలతో సత్కరించి, ప్రసాదాలు ఇచ్చి మెమెంటో అందించారు. ఇలాంటి దాతలు ముందుకురావాలని ఏసీ కోరారు.

పరారీలో ఉన్న నిందితుడి అరెస్టు

పోరుమామిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అటెంప్ట్ మర్డరు కేసులో నిందితుడిగా ఉండి పరారీలో ఉన్న చాటకొండు గురయ్యను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఏడు నెలలుగా గురయ్య పరారీలో ఉన్నాడని శనివారం సీతారాంపురం క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసి బద్వేలు కోర్టుకు హాజరుపరచామన్నారు.

వ్యక్తి ఆత్మహత్య - కేసు నమోదు

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విష ద్రావణం తాగి భూమిరెడ్డి నాగిరెడ్డి (30) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. బి.మఠం మండలం లింగాలదిన్నెపల్లె వాసి భూమిరెడ్డి సుబ్బిరెడ్డి కుమారుడు నాగిరెడ్డి పంట సాగు చేసేవాడు. ఇటీవల పెట్టిన పంటకు కనీస మద్దతు ధర రాకపోవడంతో అప్పులు ఎక్కువై మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం విషద్రావణం తాగాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

నలుగురు దొంగలు అరెస్టు

కడప క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో కాపర్, సిల్వర్ వైర్లు అపహరించే నలుగురు దొంగలను అరెస్టు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ జయరాములు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు కర్నూలు జిల్లాకు చెందిన వెంకటేశ్, కడప నిరంజన్‌నగర్ వాసులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఖాజాహుసేన్ కాపర్, సిల్వర్ వైర్లు దొంగిలించి ముద్దలుగా చేసి విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సా చేసేవారు. దొంగలించిన కాపర్, సిల్వర్ వైర్లతో పారిపోతుండన్నట్లు అందిన సమాచారంతో కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు నలుగురిని రిమ్స్ రోడ్డు రైల్వే ట్రాక్ బ్రిడ్జి వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి 150 కిలో కాపర్ వైరు 50 కిలోల సిల్వర్ వైర్లు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించామన్నారు.

16 మందిని కరిచిన పిచ్చికుక్క


చికిత్స పొందుతున్న బాలుడు

మైదుకూరు రూరల్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక వనిపెంట రోడ్డులోని ఎర్రచెరువు వద్ద నుంచి నంద్యాల రోడ్డు బైపాస్ వరకు సుమారు 16 మందిని ఓ పిచ్చికుక్క కరిచి గాయపరిచింది. దారి వెంబడి కనపడిన వారందరినీ కుక్క కరుస్తుండడంతో స్థానికులు మున్సిపాలిటీ అధికారులకు సమాచారం అందించారు. కుక్కను పట్టుకునేందుకు అధికారులు సిబ్బందితో ప్రయత్నాలు చేస్తున్నారు. గాయపడిన వారు మైదుకూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

నేడు శంకుస్థాపన

పెండ్లిమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆదివారం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు తెలిపారు. కొత్త గంగిరెడ్డి పల్లె పంచాయతీలోని సొగలపల్లె, నందిమండలంలో కార్యక్రమాలు ఉంటాయని, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కడప(వినాయకనగర్),అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్ స్వర్ణ ప్రార్థన మందిరంలో ఆదివారం నారాయణి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ భార్గవ్‌రామ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చర్మవ్యాధులు, గర్భకోశ వ్యాధులకు వైద్యం అందించి రాయితీపై మందులు ఇ స్తామన్నారు. అలాగే మాసాపేట బేతేస్తా ప్రా ర్థన మందిరంలో కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ పార్థసారధి తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ: కమిషనర్

కమలాపురం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథం తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. పట్టణంలో పారిశుధ్య ప్రమాణాలు పాటించాలని పారిశుధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వీధుల్లోనూ, కాల్వల్లోనూ చెత్త పడేయరాదని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా ఉంచుకునే విధంగా బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీధులలో వర్షం నీరు నిల్వవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి వీధిలో బ్లీచింగ్ పొడరు చల్లి శుభ్రపరచాలని పేర్కొన్నారు.



డ్రైనేజీ కాల్వను పరిశీలిస్తున్న కమిషనర్ జగన్నాథం

తెలుగు భాష అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వైవీయూ పరిధిలోని అంతర్గత పరిపాలన వ్యవహారాల్లోనూ, విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లోనూ తెలుగు భాషను అమలు చేయాలని ఏపీ అధికార భాషా సంఘం పూర్వసభ్యుడు డాక్టర్ తవ్వ వెంకటయ్య, పాలక మండలి సభ్యుడు ప్రొఫెసరు మూలమల్లిఖార్జునరెడ్డి వీసీ క్రిష్ణారెడ్డికి విన్నవించారు. వైస్‌చాన్సలరు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వీలైనంత త్వరగా తెలుగుభాష అమలుకు కృషి చేస్తామని పేర్కొన్నట్లు ఈ సందర్భంగా వారు తెలిపారు.

వృథాగా సంపద తయారీ కేంద్రాలు

● వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యం ● రూ.లక్షల ప్రజాధనం మట్టిపాలు

వీరపునాయునిపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలే దేశ ప్రగతికి మూల స్తంభాలు. అచ్చమైన పచ్చదనానికి నిలువెత్తు సాక్ష్యాలు గ్రామ సీమలు. ఇది ఒకప్పటి మాట. ప్రస్తుతం ఏ పల్లెలో చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇందుకు నిదర్శనమే గ్రామసీమలు. ఇందులో భాగంగా స్వచ్ఛభారత్ కింద గ్రామ పంచాయతీలు ఆర్థిక ఆదాయాన్ని పెంచేందుకు 2014లో టీడీపీ ప్రభుత్వం మ హాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. ఒక్కొక్క కేంద్రానికి రూ.8లక్షల నుంచి రూ.10 లక్షలు ఖర్చుచేసి నిర్మించారు. ఒక్కో మండలంలో సరాసరి 15 నుంచి 20 కేం ద్రాలు నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ కోసం జనాభాను బట్టి గ్రీన్ అంబాసిడర్ ఏర్పాటుచేశారు. చెత్త నుంచి కంపోస్టుల ద్వారా ఎరువులను తయారు చేసి పంటసాగులో రసాయనిక ఎరువుల బదులు సేంద్రియ ఎరువులు వాడుకునే విధంగా గ్రామ పంచాయతీ ఆదాయాన్ని పెంచాలనుకున్నారు. తడిపొడి చెత్త సేకరణ చేపట్టి తద్వారా సంపదను సృష్టించవచ్చని భావించారు. సంపద తయారీ కేంద్రాలపై నిర్లక్ష్యం ప్రదర్శించడంతో సంపద సృష్టి కేంద్రాల్లో నిర్వీర్యం అయిపోయాయి. ఈ పథకం లక్ష్యం నీరుగారిందని చెప్పవచ్చు. వీరపునాయునిపల్లె మండలంలో 20 కేంద్రాలు ఉన్నాయి.30 నుంచి 34 మంది గ్రీన్ అంబాసిడర్లు ఏర్పాటుచేశారు. వేరే గ్రామ పంచాయతీ నుంచి ఒక్కొక్కరికి రూ. 6వేలు అందించాలి. వీళ్లకు ఏళ్ల తరబడి జీ తాలు అందలేదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి అక్కడ పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు గాజు, పరికరాలు వేర్వేరుగా చేసి తడిపొడి చెత్తగా విభజించారు. చెత్తసేకరణ చాలా గ్రామాలలో జరగలేదు. గ్రీన్ అంబాసిడర్లకు కేంద్రాల నుంచి వచ్చే ఆదాయం ఇవ్వాలి. ప్రస్తుతం కేంద్రాలలో పిచ్చిమొక్కలు, మేకలు, గొర్రెలు ఉన్నాయి. సంపద సృష్టి కేంద్రాలపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించి గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



అడవిచెర్లోపల్లెలో నిరుపయోగంగా ఉన్న సంపద సృష్టి కేంద్రం

డ్రైనేజీకి అనుగుణంగా హోమియోపతి కళాశాల రోడ్డు నిర్మాణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● నీటినిల్వలు తొలగించండి ● కమిషనర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ వ్యవస్థకు అనుగుణంగా హోమియోపతి కళాశాల రోడ్డు నిర్మాణం చేపడతామని కమిషనర్ ఎస్.మనోజ్‌రెడ్డి అన్నారు. రోడ్డుపై నిలిచిన నీటిని త్వరితగతిన తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి కమిషనరు స్పందించి కడప నగరం రామాంజనేయనగర్, సన్‌సిటీ, ఎఎస్ఆర్ నగర్, ఆచారికాలనీ, ఎస్‌బీఐ కాలనీ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హోమియోపతి కళాశాల రోడ్డుపై ఉన్న నీటి నిల్వలకు కారణాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమస్య పరిష్కారానికి రోడ్డు పునర్ నిర్మాణం చేయాల్సి ఉంటుందని, దానికి కావాలసిన అంచనాలను త్వరితగతిన తయారు చేయాలని సూచించారు. అలాగే రోడ్డుపై నిలచిన నీటిని మోటార్లతో తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాల న్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ చెన్నకేశవరెడ్డి, ఈఈలు ఏఈలు, శానిటేషన్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

కమలాపురం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు కడప సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసరు ఎ.వెంకటేశ్వర్లు ఉత్తర్వుల మేరకు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది సహకారంతో అవేర్‌నెస్ బ్యానర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణ పరిధిలో ప్రజలకు సైబర్ క్రైం, ర్యాగింగ్, హెల్ప్‌లైన్ నెంబర్లు, మహిళా సమస్యల పరిష్కారం తెలుపుతూ డిస్‌ప్లే బ్యానర్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఏదో ఒక రూపంలో ప్రజలను మోసగించేందుకు యత్నిస్తున్నారన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కమలాపురం క్రాస్‌రోడ్డులో పోలీసుకు సంబంధించిన టోల్‌ఫ్రీ నెంబర్లు, హెల్ప్‌లైను నెంబర్లను తెలుపుతూ బ్యానర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కమలాపురం సబ్‌జైలు వద్ద పెట్రోలు బంకుల వద్ద ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహన కల్పిస్తూ బ్యానర్ ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా సంబటూరు బస్టాండు వద్ద మహిళా సమస్యల పరిష్కారం నిమిత్తం బ్యానర్ ఏర్పాటు చేశామన్నారు. పుత్తా కాలేజీకి వెళ్లే దారిలో పాత ఎస్‌బీఐ వద్ద ర్యాగింగ్, గంజాయికి దూరంగా యువత ఉండాలన్నారు.

వర్షాలకు పంటలు దెబ్బతినకుండా చూసుకోవాలి

సీకేదిన్నె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినకుండా చూసుకోవాలని కడప జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారులు నాగేశ్వరరావు, చంద్రనాయక్ తెలిపారు. స్థానిక ఊటుకూరులో వ్యవసాయ పరిశోధన స్థానం నందు శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల్లోని ఏడీఏలకు వర్షాలకు పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పంటలను ఆశించిన చీడపీడల నివారణ గురించి వివరించి అందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రాబోయే రబీ సీజన్‌లో అనువైన రకాల గురించి వివరించారు. కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త వీరయ్య, ఏరువాక కేంద్రం సమన్వయకర్త అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, శాస్త్రవేత్తలు, ఏడీఏలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

హత్య చేసిన వారిని అరెస్ట్ చేయండి: సీపీఐ

కడప మారుతీనగర్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): పెండ్లిమర్రి మండలం యాదవాపురం గ్రామానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేసిన వారిని అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనివాసులు హత్యకేసులో ప్రధాన నిందితులైన నాగ పుల్లారెడ్డి, చిన్న పుల్లారెడ్డిని ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. వెంటనే వారిని అరెస్ట్ చేయకపోతే అన్ని ప్రజా సంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు కేసీ బాదుల్లా, గంగా సురేష్ పాల్గొన్నారు.

20న యూటీఎఫ్ మహాసభలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన కర్యాదర్శి మహేశ్‌బాబు తెలిపారు. శనివారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ అనురాధ చేతుల మీదుగా మహాసభల కరపత్రాలను ఆ విష్కరించారు. ఉదయం 9గంటలకు కడప కోటిరెడ్డిసర్కిల్ నుంచి ఎర్రముక్కపల్లె సర్కిల్ మీదుగా యూటీఎఫ్ భవన్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు.

ఆర్డీఓ విచారణ

పెండ్లిమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధలోని ఏనుగువారిపల్లెకు చెందిన రైతు ఏనుగు చంద్రాయుడి ఆత్మహత్యపై శనివారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఇన్‌చార్జి ఏడీఏ సురేష్‌కుమార్‌రెడ్డి విచారించారు. మృతుడి కుటుంబ సభ్యలను, గ్రామస్థులను, అప్పులు ఇచ్చిన వారిని పిలిపించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చల్లని దొర, తహసీల్దార్ అనురాధ పాల్గొన్నారు.

22న గ్రామసభలు

పులివెందుల టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండల పరిధిలో ఈనెల 22న గ్రామసభలు ఉంటాయని తహసీల్దారు నజీర్ అహ్మద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రీసర్వేకు సంబంధించి సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చని పేర్కొన్నారు.

అభివృద్ధితోనే పల్లెల నిండా పండుగ







బలసింగాయపల్లెలో సిమెంటు రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీడీఓ.. ఇప్పెంటలో రోడ్డు పనులకు శంకుస్థాపన.. పెండ్లిమర్రిలో...

చెన్నూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే ఆ ప్రాంతాలకు పల్లెల నిండా పండుగ వాతావరణం నెలకొంటుందని ఎంపీడీఓ కిరణ్‌కుమార్‌రావు అన్నారు. శనివారం చెన్నూరు భవానీనగర్‌లో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అలాగే బలసింగాయపల్లెలో సీనియర్ టీడీపీ నేతలు లేవాకు శివారెడ్డి, లేవాకు విజయప్రతాప్‌రెడ్డి, ఓ.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. అవపరమైన కోట్లాది రూపాయల నిధులు ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆయా పల్లెల్లో పండుగ వాతావరణం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఏఈ మల్లిఖార్జున, జిల్లా బలిజ సంఘం నాయకులు ఆకుల ప్రసాద్‌బాబు, సీనియర్ టీడీపీ నేతలు మల్లిఖార్జునరెడ్డి, షబ్బీర్‌హుసేన్, కల్లూరు ఓబుల్‌రెడ్డి, ఏపీఓ శైలజ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

సీకేదిన్నె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ కుళాయిబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం ఇప్పెంట పంచాయతీ పాపాసాహెబ్‌పేట పంచాయతీల్లో 12 సిమెంటు రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్లు మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గంధం మోహన్‌బాబు, భద్ర, రవి, జబివుల్లా, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడమే లక్ష్యం

పెండ్లిమర్రి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచు ప్రతాప్ రెడ్డి అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మిన్నయ్యగారిపల్లె గ్రామంలో మినీ గోకులానికి సర్పంచు, ఉపాధి ఏపీఓ ఓబులమ్మ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి నిధుల కింద మండలానికి 25మినీ గోకులాలు మంజూరయ్యాయని, కావున లబ్ధిదారులు పనులు మొదలుపెట్టి త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, టీడీపీ నాయకులు సురేష్ కుమార్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్లకు మహర్దశ

వేంపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రోడ్లకు మహర్దశ వచ్చిందని, ఈ ప్రభుత్వం లక్షలాది రూపాయల వ్యయతో సిమెంటు రోడ్లు నిర్మిస్తోందని మండల కన్వీనర్ మునిరెడ్డి తెలిపారు. మండలంలోని అలిరెడ్డిపల్లె గ్రామంలో రూ.5లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, నామావేమకుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

వీరపునాయునిపల్లె, అక్టోబరు 19: మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో శనివారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.10లక్షలతో ప్రహరీ గోడ నిర్మించేందుకు భూమిపూజ చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రహరీగోడ నిర్మాణానికి భూమపూజ చేసినట్లు తెలిపారు. అలాగే రూ.5లక్షలతో వీరపునాయునిపల్లెలో వైవీరోడ్డు నుంచి ఎస్ఆర్‌పేట కాలనీ వరకు కాంట్రాక్టర్ జనార్ధన్‌రెడ్డి ఎస్ఆర్‌పేట కాలనీ టీడీపీనాయకులు కృష్ణమోహన్‌రెడ్డి భూమిపూజ చేశారు. నాలుగుచోట్ల గోకులం షెడ్లకు భూమి పూజ చేశారు. అరుణ్‌కుమార్‌రెడ్డి, పీఆర్ ఏఈ మల్లారెడ్డి, ఏపీఓ లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.



ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ విద్యాలయాలను పరిశీలించిన అధికారులు

వేముల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాఠశాలలు, కళాశాలలను శనివారం యూసీఐఎల్ అధికారులు పరిశీలించారు. ఇటీవల టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి యూసీఐఎల్ అధికారులను కలిసి పాఠశాలలను పరిశీలించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ, జిల్లా పరషత్ ఉన్నత పాఠశాల, ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్సీ హాస్టల్, పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు కృషిచేస్తామని యూసీఐఎల్ అధికారులు నవీన్‌రెడ్డి, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ గంగిరెడ్డి బృందం తెలిపారు.



మాట్లాడుతున్న యూసీఐఎల్ అధికారులు

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వల్లూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సాయి జ్యోతి తెలిపారు. వల్లూరు మండలం లేబాక రైతు సేవా కేంద్రంలో విలేజీ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రైతులకు సమాచార హక్కు చట్టంపైన అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. 30 రోజుల్లో అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి

సీకేదిన్నె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు గ్రామ సభలను సద్వినియోగం చేసుకుని వారి భూముల సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. 23న కమ్మవారిపల్లె పంచాయతీలో, 24, 25న పాపాసాహెబ్‌పేట, 26న బుగ్గలపల్లె, 29న బాలుపల్లి రామాలయంలో, 30న బుగ్గలపల్లె, నవంబరు 2న బుగ్గనపల్లి గ్రామ సచివాలయాల్లో సమావేశాలు ఉంటాయన్నారు.

కూలిన మిద్దె - సామాన్లు ధ్వంసం

వేంపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని 7వ వార్డు రజక కాలనీలో ఎన్.గురుప్రసాద్ చౌడుమిద్దె కూలిపోయింది. ఇంట్లో అంతా రాత్రి ఉన్నసమయంలో ఒక్కసారిగా పైకప్పు పడిపోయింది. ఇట్లో ఉన్న ఫ్రిజ్, టీవీ, గ్యాస్ స్టౌ వంట సామగ్రి దెబ్బతిన్నాయి. ఉన్న ఇంటితో పాటు ఇంట్లో ఉన్న వస్తువులు నష్టపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. టీడీపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, జిల్లా కార్యదర్శి శేషారెడ్డి పరిశీలించి బాధితులను పరామర్శించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సహాయం వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. వారి వెంట టీడీపీ నేతలు చైతన్య, యాసిన్, గంగాధర్ రెడ్డి, రాహుల్ తదితరులు ఉన్నారు.

సాంకేతిక విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

వేంపల్లె, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యను అభ్యసిస్తే ఉద్యో, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటటాయని తహసీల్దార్ హరినాథ్ రెడ్డి, ఎస్‌కేఓఆర్సీ ఐటీఐ ప్రిన్సిపల్ ప్రసాదరావు తెలిపారు. వేంపల్లెలోని కందుల ఓబులరడ్డి చారిటబుల్ ఐటీఐలో గత ఏడాది పాసైన విద్యార్థులకు శనివారం సర్టిఫికేట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి విద్య, సాంకేతిక విద్య వంటి వాటిపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. నాణ్యమైన వృత్తి నైపుణ్యం పొందితే ఎన్నో రంగాలలో సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సురేష్‌రెడ్డి, పచాయతీ కార్యదర్శి నాగభూషణంరెడ్డి, చక్రాయపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రాధాకృష్ణ పాల్గొన్నారు.



సర్టిఫికేట్లు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ హరినాథరెడ్డి

దోమల వల్ల ప్రబలే వ్యాధులను వివరించాలి

పులివెందుల రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దోమల వల్ల ప్రబలే ప్రాణాంతక వ్యాధులను వివరించి ప్రజలను చైతన్యపరచాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ సూచించారు. శనివారం నగరిగుట్ట పీహెచ్‌సీని సందర్శించి ల్యాబ్ రికార్డులను తనిఖీ చేసిన ఆమె ఆరోగ్య, ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారి నుంచి రక్తపూతలు సేకరంచాలన్నారు. ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలని, ఆ వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామంలోని ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయాలన్నారు. అనంతరం నగరిగుట్టలో లార్వా సర్వే నిర్వహించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్, డాక్టర్లు స్నేహ ప్రత్యూష పాల్గొన్నారు.

చోరీ వస్తువుల రికవరీ

చెన్నూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు కొత్తరోడ్డులోని ఓ మెడికల్ షాపులో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండు కు తరలించినట్లు సీఐ పురుషోత్తం రాజు తెలిపారు. కడప నగర వాసులు సయ్యద్ మహ్మద్ యూసఫ్, షేక్ ఫర్హణ్ మూడురోజుల కిందట మెడికల్ షా పులో రెండు సెల్‌ఫోన్లు, ఒక వాచ్ రూ.2500 రికవరీ చేశారు. దీంతో షాపు యజమాని దొంగతనంపై ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన సీఐ చోరీకి గురైన వస్తువులు రికవరీచేసి, నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు.

ఎన్డీఏ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

కాశినాయన అక్టోబరు,19 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వంతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ, బద్వేల్ టీడీపీ యువనేత పార్టీ సమన్వయకర్త కే.రితీష్‌రెడ్డి పేర్కొన్నారు.శనివారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా కోడిగుడ్లపాడు గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్డుకు వారు భూమి పూజ చేశారు ఈకార్యక్రమంలో ఎంపీడీవో మైథిలీ,జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, హోండా రవీంద్రారెడ్డి,శ్రీనివాసులరెడ్డి, నర్శిరెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



కాశినాయన.. భూమిపూజలో పాల్గొన్న విజయమ్మ,రితీష్‌రెడ్డి

ప్రొద్దుటూరు..: కూటమి ప్రభుత్వంలో పల్లెలకు నిజమైన పండుగ వచ్చిందని సర్పంచ్ శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉపాధి హామీ పథకంలో భాగంగా 15 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రారంభించారు. పంచాయితీ రాజ్ ఇంజనీర్లు కార్యదర్శి పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని అట్లూరు, వరికుంట్ల, రెడ్డిపల్లె గ్రామాలకు 44 లక్షల ఉపాధి నిధులతో 9 సిమెంటు రోడ్లకు ఎంపీపీ పొత్తపి రమాదేవి భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి , సుధారాణి, రెడ్డయ్య, జయక్రిష్ణారెడ్డి , విష్ణువర్ధన్ రెడ్డి, అమర్‌నాథరెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి,పెద్దరామసుబ్బారెడ్డి, రమణయ్య, సుబ్బరామిరెడ్డి, చిలిపి క్రిష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కొత్తపి నర్సింహులు, చినరామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో భాస్కర్‌బాబు, ఏపీవో జయచంద్ర, పీఆర్ ఏఈ హసీనా, పంచాయతీ సెక్రటరీ గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

గోపవరం..: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీ లో రూ.5లక్షలు అంచనాతో మంజూరైన సిమెంటు రోడ్లను గోపవరం జడ్పీటీసీ కలువాయి జయరామిరెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు ధనలక్ష్మి, ఎంపీడీవో రామనాథరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని అయిదు గ్రామాల్లో శనివారం ఎంపీడీవో వీరకిశోర్, టీడీపీ నాయకుడు వీరనారాయణ పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీవో జగదీశ్వర్‌రెడి, టీడీపీ నాయకులు గురివిరెడ్డి, వీరనారాయణ, ఈశ్వరయ్య, క్రిష్ణారెడ్డి, సుబ్బరాయుడు, రమణ, వీరశేఖర్‌రెడ్డి, శివరామక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేట..: పల్లెలు, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మిడుతూరు, నేలటూరు, త్రిపురవరం, పంచాయతీల్లో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో దివిజ, టీడీపీ నాయకుడు హరినాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ కాలనీలో రోడ్లు వేయాలి

బద్వేలు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్యాగరాజు కాలనీలో సంవత్సరాల తరబడి రోడ్లు వేయకపోవడంతో వర్షం వస్తే డ్రైనేజీ వాటర్‌తో సహా అన్ని నిలబడి పోతున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని పేర్కొన్నారు. తాగ్యరాజు కాలనీకి రోడ్లు వేయాలని కోరుతూ శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఆదిల్ , రూరల్ కార్యదర్శి బాలగుర్రయ్య, పట్టణ ఉపాధ్యక్షుడు యువరాజ్, ఖలీల్‌బాష పాల్గొన్నారు,

23న తలనీలాల వేలం పాటలు

పోరుమామిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న మద్దిమాను గురప్పస్వామి దేవస్థానంలో తలనీలాల వేలం పాట నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహణాధికారి నరసయ్య తెలిపారు. తలనీలాలు సేకరించుకొనుటకు లక్ష రూపాయలు, నిల్వ ఉన్న తలనీలాలు సేకరించుకునేందుకు లక్ష రూపాయలు డిపాజిట్ చేయాలన్నారు. దక్కించున్న వారు ఈ ఏడాది అక్టోబరు 26 నుంచి 2025 అక్టోబరు వరకు సంబంధించిన కాలపరిమితి ఉంటుందన్నారు.

వృద్ధుడికి అంత్యక్రియలు

జమ్మలమడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో నివాసం ఉంటున్న చౌడం బాలకొండు (84) అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు బంధువులు ఎవరూ అంత్యక్రియలు, అంతిమ సంస్కరాలు చేయడానికి ముందుకు రాకపోవడంతో శనివారం మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ఛైర్మన్ మోరే లక్ష్మణరావు వారి కమిటీ సభ్యులు వృద్ధుడికి అంతిమ సంస్కరాలు నిర్వహించారు. ఎవరైనా అనాథలు చనిపోతే ముందుకు ఎవరూ రాకపోతే 8297253484 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని, అలాంటి కార్యక్రమాలకు మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ముందుంటుందని వారు తెలిపారు.

రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం

ప్రొద్దుటూరు, అక్టోబరు 19 : రీసర్వే ప్రాజెక్టుతో రైతులకున్న భూసమస్యలు పరిష్కారమౌతున్నాయని రీసర్వే డిటీ సుధర్శన్ పేర్కొన్నారు. శనివారం సర్విరెడి పల్లెలో గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సర్వేఅధికారి పుల్లయ్య, డివిజన్ సర్వేఅధికారి వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ వెంకటలక్ష్మి, విలేజ్ సర్వేయర్ పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు వేయరా..?



మోరగుడిలో అధ్వానంగా ఉన్న రోడ్డు

జమ్మలమడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో ఎస్సీ కాలనీ వెనుక భాగాన అంగన్వాడీ సెంటర్ ఎదురుగా రోడ్డు దారుణంగా మారింది. గత ప్రభుత్వంలో స్థానికులు సిమెంటు రోడ్డు వేయాలని అప్పటి ప్రజాప్రతినిధులకు తెలియజేసినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం వర్షాలతో రోడ్డులో నడిచి వెళ్లాలంటే నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు. సిమెంటు రోడ్డు మోక్షం ఎప్పుడు వస్తుందోనని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి వెంటనే సిమెంటు రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కిందపడితే గానీ స్పందించరా

తుప్పుపట్టిన విద్యుత్తు స్తంభంతో ఆందోళన

జమ్మలమడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్టవీధిలో విద్యుత్తు స్తంభం తుప్పు పట్టింది. మూడు నెలల నుంచి తుప్పుపట్టిన విద్యుత్తు స్తంభాన్ని వెంటనే మార్చాలని స్థానిక బీజేపీ మహిళా నాయకురాలు మెరుగు అరుణ కుమారి తదితరులు విజ్ఞప్తి చేసినా అధికారులు స్పందించడంలేదని వారు తెలిపారు. ఆ రోడ్డులో నిత్యం వాహనాలు తిరుగుతుంటాయని, ఎప్పుడైనా కూలేందుకు సిద్ధంగా ఉందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలనివిద్యుత్తు అధికారులను కోరారు.



పారిశుధ్యంపై స్పెషల్‌డ్రైవ్

ప్రొద్దుటూరు, అక్టోబరు 19 : కొన్ని రోజుజులుగా కురుస్తున్న తుఫాన్ కారణంగా పట్టణంలో అనేక ప్రాంతాల్లో పారిశుధ్య సమస్య తలెత్తిం దని దీనిపై స్పెషల్ డ్రైవ్ పెట్టి పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసు కుంటున్నట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. శనివారం మోడం పల్లెలో నెలకొన్న పారిశుధ్య సమస్యపై కమిషనర్ మల్లికార్జున స్వయం గా ఆ ప్రాంతాన్ని సందర్శించి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్ బాషా సిబ్బం ది చేత అక్కడ పారిశుధ్య మెరుగు చర్యలు తీసుకున్నారు. ఎక్కడా అంటువ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



పనులు పర్యవేక్షిస్తున్న కమిషనర్

ముగిసిన శిక్షణ తరగతులు

కాశినాయన, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నర్సాపురంలో శుక్రవారం ప్రారంభమైన ఉపసర్పంచ్‌ల,వార్డుసభ్యులు రెండు రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయని ఎంపీడీవో మైథిలీ తెలిపారు. చివరి రోజున శనివారం పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన ఉపసర్పంచ్‌లు,వార్డు సభ్యుల విధులు,బాధ్యతలపై సభ్యులకు అవగాహనకల్పించారు. ఈకార్యక్రమంలో ఏవో శీతారామిరెడ్డి, పలువురు పంచాయతీ సెక్రటరీలు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: గ్రామ పంచాయతీ విధివిధానాలు ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా తెలుసుకోవాలని ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. శనివారం ఎర్రగుంట్ల ఎంపీడీవో కార్యాలయం లో ఉపసర్పంచుల కు,వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్ష ణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఉపసర్పంచు లకు, వార్డు సభ్యులకు ప్రభుత్వం పంపిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు.

పోరుమామిళ్ల..: స్త్రీశక్తిభవనంలో మండలంలోని సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు వార్డుసభ్యులకు ఎంపీడీవో రమణారెడ్డి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమాలు జరిగాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మైథిలీ

ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం పంచాయతీకార్యదర్శి రాజీవ్‌రెడ్డి, పుల్లీడు సర్పంచ్ రఘునాథరెడ్డి, పోరుమామిళ్ల ఉపసర్పంచ్ రాళ్లపల్లెరవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 18న శుక్రవారం నుంచి జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. వార్డు మెంబర్లు, ఉపసర్పంచులకు ఎంపీడీవో వీరకిశోర్, ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి శిక్షణ ఇచ్చారు. ఈవోపీఆర్‌డీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులపై వార్డుమెంబర్లు, ఉపసర్పంచులు సహకరించాలని కోరారు.

ఆందోళన ఉధృతం

● అన్ని ప్లాంట్లల్లో సీఈకి వినతిపత్రాలు



ఎర్రగుంట్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏపీ జెన్‌కోలో ఎంతోకాలంగా కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా మొండి వైఖరికి నిరసనగా రెండు రోజులుగా కాంట్రాక్టు కార్మికులు నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు చేశారు. శనివారం సాయంత్రం ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్లాంట్ సీఈ గౌరిపతికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సుబ్బిరెడ్డి, చంద్రశేఖర్, శేఖర్, గంగయ్య, పుల్లారెడ్డి, తదితరులు మాట్లాడుతూ భవిష్యత్తులో ఆందోళన ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. సీఈని కలిసిన వారిలో హరిఓబుళరెడ్డి, జి.శేఖర్, వెంకటరమణ, రాజు, సుధాకర్ ఉన్నారు.

పోలీసు కవాతు

భారీగా పోలీసుల మోహరింపు



ముద్దనూరు అక్టోబరు19:ముద్దనూరు టౌన్‌లో శనివారం సాయంత్రం పోలీసులు, స్పెషల్ టాక్స్‌ఫోర్సు భారీ ఎత్తున మోహరించి, కవాతు నిర్వహించారు.జమ్మలమడుగు ఇన్‌చార్జి డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో పాత బస్టాండు నుంచి నాలుగు రోడ్ల కూడలి ,జమ్మలమడుగు రోడ్డు, రైల్వే స్టేషన్ రోడ్డులో కవాతు చేపట్టారు. శుక్రవారం మద్యం దుకాణం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన సంఘటన పై , రెండో మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలుస్తోంది.అయితే పోట్లదుర్తి సురేష్‌నాయుడు వర్గానికి చెందిన రెండో మద్యం దుకాణం సోమవారానికి వాయిదా పడటంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.ఈ కార్యక్రమంలో సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్, పోలీసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు తీసుకోండి

జమ్మలమడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన తాగునీరు, పారిశుద్యం వీధిలైట్లు తదితర అంశాలపై సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సైదున్నీసా, ఈవోపీఆర్‌డీ సూచించారు. శనివారం జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయం డివిజన్ సభాభవనంలో మండలంలోని 14 గ్రామ పంచాయతీల ఉపసర్పంచులు, మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం సభాభవనంలో గాంధీజీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి సిబ్బంది నివాళులర్పించారు. మండలంలోని సెక్రటరీలు, వీఆర్వోలు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ఉపసర్పంచులు పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ

కాశినాయన అక్టోబరు(ఆంధ్రజ్యోతి)19: నర్సాపురంలోని బీసీ బాలికలు, ఎస్సీబాలుర వసతిగృహాలు సగిలేరు వద్ద ఉన్న వివేకానంద సేవాశ్రమాన్ని శనివారం బద్వేల్ కోర్టు జడ్జీలు వై.జే పద్మశ్రీ,బి.గాయత్రి తనిఖీ చేశారు. ఈసందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు,పరిసరాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో వార్డన్‌లు బాలరాజు,విజయలక్ష్మీ,ఆశ్రమ నిర్వాహకురాలు రామతులసి పలువురు నర్సాపురం పోలీసులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

బి.కోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బి.కోడూరు మండలంలో సమాచార హక్కు చట్టం 2005పై మండల స్థాయి అవగాహన కార్యక్రమం ఏవో కౌశిక ఆధ్వర్యంలో బి.కోడూరు వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం గురించి పూర్తి వివరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా ఇన్‌ఛార్జ్‌లు , ప్రజలు పాల్గొన్నారు.

వ్యాపారులు నిబంధనలు పాటించాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యాపారి నిబంధనలు తప్పక పాటించాలని లీగల్ మెట్రాలజీ అధికారి రమేశ్‌రెడ్డి అన్నారు. శనివారం పోరుమామిళ్లలోని వివిధ ప్రాంతాల్లో తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో తూకాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యాపారి నిర్ణీత కాల వ్యవధి పూర్తయిన వెంటనే తిరిగి కాటాల్లోకి అనుమతి తీసుకోవడం, తూకం రాళ్లకు ముద్రలు వేయించుకోవడం చేయాలన్నారు. నిర్ణీత ధరలు ఎమ్మార్పీ కంటే ఎక్కువ విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

ట్రిబుల్ రైడింగ్ చేస్తే కఠిన చర్యలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాసులు

పోరుమామిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాల్లో ట్రిబుల్ రైడింగ్ చేస్తే చర్యలు తప్పవని పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శని వారం సాయంత్రం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో మైనర్‌లకు ట్రిబుల్ రైడింగ్ చేసేవారికి కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ పెట్టుకుని ఫోన్లు చేస్తూ వాహనాలు నడపరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠిన చర్యలుంటాయన్నారు. బాలురకు వారి తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా కేసులు నమోదు చేస్తామన్నారు.

ట్యాంకర్స్‌తో నీటి సరఫరా



ఎర్రగుంట్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎనిమిదినెలలుగా పైప్ లైన్ మరమ్మతులు చేసి తాగునీరు అందించాలని కోరుతున్నా అధికారులు నిర్లక్ష్యం చేశారు. వేసవి అటుంచితే నిండు వర్షాకాలం కూడా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసే పరిస్థితి వచ్చింది. ఇవి నగరపంచాయతీలోని అధికారులు తీరని ప్రజలు విమర్శిస్తున్నారు. స్థానిక వినాయకనగర్ వీధిలో పైప్‌లైన్ మరమ్మతు చేయకపోవడంతో నీరందడంలేదు. అక్కడి ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రజల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో చివరకు ట్యాంకర్లతో శనివారం నీటి సరఫరా చేయాల్సివచ్చింది.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని వల్లెర వారిపల్లె గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం వేకువ జామునే ప్రత్యేక అభిషేకం, తదుపరి ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించడంతో పట్టణ గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దాతలు గోపవరం గ్రామానికి చెందిన వంశీక్రిష్ణ సహకారంతో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను నిరోధించాలని ఏఎస్ఐ రాజారమణి తెలిపారు. శనివారం స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. విజయకుమార్ సర్కిల్ నుంచి శివాలయం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు బైసాని సత్యనారాయణ మధుసూదన్‌రెడ్డి, సంధ్య ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

వంట ఏజన్సీల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, సీపీఎస్ రాష్ట్ర కమిటీ కన్వీనరు సుబ్రమణ్యం ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో రీజనల్ కన్వీనరు వీవీ క్రిష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలరు చంద్రహాసరెడ్డి, సీనియర్ నాయకులు వాకా చంద్రశేఖర్, బాలరాజు, సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గసభ్యులు గురయ్య, వెంకట్రామయ్య, శ్రీనివాసులు, మూల రామక్రిష్ణా, పుల్లయ్య, రవీంద్రబాబు, బాలఓబయ్య. జయరామిరెడ్డి పాల్గొన్నారు.

'బాధితురాలి కుటుంబానికి అండగా ఉంటాం'

బద్వేలుటౌన్ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గోపవరం మండలం సెంచరీ ప్లైవుడ్ వద్ద ఇంటర్ విద్యార్థిని దస్తగిరమ్మపై జరిగిన ఘటనపై మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి స్పందించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాధితురాలికి మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని పేర్కొన్నారు.

'సీఎంను విమర్శించడం జగన్‌కు తగదు'



మునిశేఖర్‌రెడ్డి

చాపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిని విమర్శించడం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తగదని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి దశలవారీగా మద్యనిషేధం చేస్తానన చెప్పి చేయలేదన్నారు. బేవరైజస్ కార్పొరేషన్‌ను తాకట్టు పెట్టిరూ.30 వేల కోట్లు అప్పుతెచ్చారని విమర్శించారు. ఇప్పుడు చంద్రబాబు నాణ్యమైన మద్యం, ఉచితంగా ఇసుక ఇస్తుంటే జగన్ జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. జగన్ పాలనలో కల్తీ మద్యం తాగి కొన్ని వందల కుటుంబాలు రోడ్డున పడడం జరిగిందన్నారు.

రీసర్వే గ్రామసభలో ఆరు అర్జీలు

కొండాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మురగంపల్లె , కొత్తపల్లె గ్రామాలలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. భూముల రీసర్వే కి సంబంధించి గ్రామసభలు ఏర్పాటు చేశారు. గ్రామసభలో రీసర్వేకి సంబంధించి ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ గురప్ప తెలిపారు.

దర్జాగా చెరువుల ఆక్రమణ



నాగులపల్లె చెరువులో సాగు చేసిన వరిపైరు

చాపాడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాదర్‌పల్లె, నాగిరెడ్డిపల్లె, గ్రామాల వద్ద ఉన్న చెరువులను కొంత మంది రైతులు దర్జాగా ఆక్రమించుకున్నారు. సర్వేనంబరు 394లో 228 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో సుమారు 45 ఎకరాలు ఆక్రమించుకున్నారు. వరిపైరు సాగు చేశారు. కొన్నేళ్లుగా ఆక్రమణలు జరుగుతున్నప్పటికీ ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న పాపానపోలేదు. రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు కానీ చెరువుల ఆక్రమణలపై కన్నెత్తికూడా చూడలేదు. చాపాడు ఛానల్ నుంచి వచ్చే నీరుతో ఈ చెరువులను నింపుతారు. ఈరెండు గ్రామాల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈ చెరువుల్లో నీరు నింపితే తాగునీరు, సాగునీరు లభిస్తాయి. చెరువులకు బిగించిన స్లూయిస్‌లు తుప్పుపట్టి పనికిరాకుండా ఉన్నాయి. అందువలన చెరువుల్లోని నీరు క్రమబద్ధంగా పొలాలకు విడుదల చేసేందుకు అవకాశంలేకుండా పోయింది. నాగులచెరువుకు ఉన్న అలుగు దెబ్బతింది. దీంతో చెరువులోని నీరు నిలబడకుండా బయటకు వెళ్లిపోతోంది. గతంలో పలుసార్లు ఆ గ్రామాలకు చెరువులకు ఆధునికీకరణ చేపట్టాలని ఆక్రమణలు తొలగించాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

● ఈ విషయమై చాపాడు ఛానెల్ ఏఈ గురుమోహన్‌రెడ్డిని వివరణ అడుగగా చెరువులు ఆక్రమణకు గురైన విషయం వాస్తమేనన్నారు. వరికోసిన తర్వాత చెరువులకు హద్దులు నిర్ణయించి ఆక్రమణలు కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.